# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
25-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 185

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# పదవుల పందేరం!

నామినేటెడ్ పోస్టుల భర్తీకి చర్యలు

50 కార్పొరేషన్లకు కొత్త బాసులు

నెల చివరిలో ప్రత్యేక ప్రకటన

**కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు గుడ్ న్యూస్. పెద్ద ఎత్తున నామినేటెడ్ పదవుల భర్తీకి హై కమాండ్ కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 50 కార్పొరేషన్లకు కొత్త బాసులు రానున్నారు. పార్టీకి సేవలందించిన వారికి పెద్ద పీట వేయనున్నారు. అదే సమయంలో సామాజిక సమీకరణలను పరిగణలో తీసుకోనున్నారు. కొంతమంది పాత వారికి సైతం రెన్యువల్ చేయనున్నారు. దీంతో ఆశావహుల్లో ఒక్కసారిగా సందడి ప్రారంభం అయింది.**

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: గత కొద్ది రోజులుగా నేతలు, కార్యకర్తలు పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఇప్పటికే నియమితులైన వారి పదవీకాలం ముగిసింది. అటువంటి వారు రెన్యువల్స్ కోరుకుంటున్నారు. అయితే ఈ నెల చివర్లో పదవులను పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు అధిష్టానం కసరత్తు మొదలు పెట్టింది.

**జిల్లాల వారీగా జాబితాలు..:** కాంగ్రెస్ పార్టీ జిల్లాల వారీగా నామినేటెడ్ పదవులకు సంబంధించి జాబితాలను సిద్ధం చేసింది.

మిగతా 2లో




మిగతా 2లో

# 22ఏ భూములకు బిగ్ రిలీఫ్ ..

**ఇక రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చా?**

22ఏ భూములకు మోక్షం.. రిజిస్ట్రేషన్ విషయంలో సర్కార్ కీలక నిర్ణయం

నిషేధిత జాబితాలో ఉన్నా.. అనుమతులున్న ఆస్తులకు రిజిస్ట్రేషన్ ఛాన్స్

హైదరాబాద్ సహా నాలుగు జిల్లాల్లో వేలాది ఆస్తి యజమానులకు ఊరట

సాంకేతిక కారణాలతో చిక్కుకున్న భూములపై ప్రభుత్వ కీలక ఉత్తర్వులు

అక్రమాలపై విచారణకు ప్రత్యేక ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు

**ఒక భూమికి అన్ని అనుమతులు ఉన్నాయి.. లేఅవుట్ కూడా చట్టబద్ధంగా ఆమోదమైంది.. నిర్మాణానికి సంబంధిత సంస్థల అనుమతులూ ఉన్నాయి. కానీ రిజిస్ట్రేషన్ దగ్గరకు వెళ్లేసరికి మాత్రం 22ఏ నిషేధిత జాబితా అడ్డుగా నిలుస్తోంది. దీంతో ఏళ్లుగా ఆస్తులు చేతిలో ఉన్నా వాటిని విక్రయించలేక, బదిలీ చేయలేక పలువురు యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారికి తెలంగాణ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం కొంత ఊరటనిచ్చేలా మారింది.**

హైదరాబాద్, సెప్టెంబర్ 24: 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ, చట్టబద్ధమైన ప్రణాళికా సంస్థల నుంచి అనుమతులు పొందిన లేఅవుట్లు, భవనాల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి అనుమతులు ఉన్న ఆస్తులకు ఈ వెసులుబాటు వర్తించనుంది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు, వాటిని తక్షణమే అమలు చేయాలని స్పష్టం చేసింది.

# కాంగ్రెస్ లో 'ఎమ్మెల్సీ' సందడి!





పట్టభద్రుల స్థానాలకు అభ్యర్థుల ఎంపికను మొదలుపెట్టిన హస్తం

ఒక్కో స్థానానికి ముగ్గురు ఆశావహులతో కూడిన జాబితా

వడబోత పనుల్లో భట్టి, దామోదర రాజనర్సింహ

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది.



# విశాఖకు మెట్రో!

డబుల్ డెక్కర్ కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

అత్యాధునిక ఇంజనీరింగ్ ప్రమాణాలతో డిజైన్

ఒకే పిల్లర్ పై దిగువున ఫ్లై ఓవర్, ఎగువన మెట్రో కారిడార్

త్వరలో పనులు ప్రారంభం

**క్రైమ్ మిర్రర్, విశాఖపట్నం:** విశాఖ నగర ప్రజలకు, ఉత్తరాంధ్రవాసులకు గుడ్ న్యూస్. సాగరనగరం విశాఖపట్నం ప్రజా రవాణా వ్యవస్థలో సరికొత్త విప్లవానికి తెరలేచింది.

మిగతా 3లో



# విద్యుత్ ఎమర్జెన్సీ!

ప్రమాదపుటంచున దక్షిణ భారతదేశం

తీవ్ర విద్యుత్ సంక్షోభం

దాదాపు అన్ని రాష్ట్రాలది అదే పరిస్థితి

తమిళనాడులో మరింత తీవ్రం

పారిశ్రామిక రంగంపై పెను ప్రభావం

మిగతా 3లో



# తేలనున్న భూ ఆక్రమణల లెక్క!

గులాబీ పార్టీ నేతల అక్రమాలపై విచారణకు హై లెవెల్ కమిటీ

అధికారికంగా ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

- మిగతా 2,3వ పేజీలో



# అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట!

రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్లకు సంబంధించి భూములను నిషేధిత జాబితా నుంచి తొలగింపు

బాండ్ల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

క్యాబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం

# వైసీపీకి శ్రీకాకుళం జడ్పీ చైర్ పర్సన్ గుడ్ బై?!

టిడిపిలో చేరేందుకు సిద్ధపడిన పిరియా విజయలక్ష్మి, సాయి రాజ్ దంపతులు

గత కొంతకాలంగా వైసిపి నాయకత్వం పై అసంతృప్తి



మిగతా 2, 3లో

# విదేశాలకు సీఎం చంద్రబాబు!

మూడు రోజులపాటు కుటుంబంతో టూర్

ప్రైవేటు కార్యక్రమం కావడంతో షెడ్యూల్ ప్రకటించని ప్రభుత్వం

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు బాధ్యతలు?





# దానం ఎపిసోడ్‌లో బీఆర్ఎస్‌కు బలం..

కౌశిక్ రెడ్డి కీలక వ్యాఖ్యలు.. దానం అనర్హతపై సుప్రీం తీర్పు.. కౌశిక్ రెడ్డి హర్షం

సుప్రీం తీర్పు తర్వాత కౌశిక్ రెడ్డి ఫైర్.. కాంగ్రెస్, బీజేపీలపై సంచలన ఆరోపణలు

దానం నాగేందర్ అనర్హతను సమర్థించిన సుప్రీంకోర్టు నిర్ణయంపై స్పందన

ఫిరాయింపుల అంశంలో తమ వాదనకు న్యాయపరమైన ప్రాధాన్యం వచ్చిందని వ్యాఖ్య

రెండు జాతీయ పార్టీలపై రాజకీయ కుమ్మక్కు ఆరోపణలు

మిగతా 3లో

# ఖైరతాబాద్ ఉప ఎన్నిక అనివార్యం!

తేల్చి చెప్పిన అత్యున్నత న్యాయస్థానం

తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకమే

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** అనుకున్నంత అయ్యింది. ఖైరతాబాద్ నియోజకవర్గానికి



# 22ఏ భూములకు బిగ్ రిలీఫ్ ..

**అసలు చిక్కు ఎక్కడ వచ్చిందంటే..**

కొన్ని ఆస్తులు భూ రికార్డుల్లోని సాంకేతిక అంశాలు, రెవెన్యూ వర్గీకరణలు తదితర కారణాలతో 22ఏ పరిధిలోకి వెళ్లాయి. అయితే అదే సమయంలో ఆయా ప్రాంతాల్లో లేఅవుట్లు, నిర్మాణాలకు సంబంధిత పట్టణ ప్రణాళికా సంస్థల అనుమతులు లభించాయి. దీంతో ఒకవైపు ఆస్తిపై అనుమతులు ఉండగా.. మరోవైపు రిజిస్ట్రేషన్ విషయంలో అడ్డంకి ఏర్పడింది. ఈ వ్యత్యాసంతో పలువురు యజమానులు తమ ఆస్తులను విక్రయించలేకపోయారు. కొనుగోలు చేసినవారు కూడా తదుపరి లావాదేవీలు చేయలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ తరహా ఆస్తులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఏర్పడింది.

**నాలుగు జిల్లాలపై ప్రభావం..**

ఈ నిర్ణయం ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక హౌసింగ్ కాలనీలకు ప్రాధాన్యత సంతరించుకుంది. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో చాలాకాలంగా స్తంభించిన ఆస్తి లావాదేవీలకు మళ్లీ కదలిక వచ్చే అవకాశం ఉంది. యజమానులు తమ ఆస్తులకు సంబంధించిన అనుమతులు, ఇతర పత్రాలతో అధికారులను సంప్రదించి ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. అయితే 22ఏ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్య ఇక్కడితో ముగియడం లేదు. ఒకవైపు అర్హత ఉన్న




ఆస్తులకు రిజిస్ట్రేషన్ మార్గాన్ని తెరవగా.. మరోవైపు ఈ జాబితాలో భూములు చేరిన విధానం, జరిగిన అక్రమాలపై లోతైన విచారణకు కూడా శ్రీకారం చుట్టింది.

**అక్రమాలపై కమిటీ.. అసలు లెక్క తేల్చనున్నారా?**

అసెంబ్లీలో 22ఏ భూముల అంశంపై చర్చ జరిగిన తర్వాత ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఈ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా సభ్యులుగా ఉండనున్నారు. సంబంధిత జిల్లాల కలెక్టర్లు కూడా కమిటీతో కలిసి పనిచేయనున్నారు. 22ఏ పరిధిలోకి భూములు వెళ్లిన సందర్భాలు, నిబంధనల ఉల్లంఘనలు, అక్రమాలకు సంబంధించిన అంశాలను కమిటీ పరిశీలించనుంది. ఈ పరిశీలన కేవలం 22ఏ భూములకే పరిమితం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో 22ఏ వ్యవహారంలో ఒకవైపు రిజిస్ట్రేషన్ కోసం ఎదురుచూస్తున్న ఆస్తి యజమానులకు మార్గం సుగమం కాగా.. మరోవైపు నిషేధిత జాబితాలో భూములు చేరిన తీరుపై విచారణ మొదలుకానుంది. దీంతో ఇంతకాలం రిజిస్ట్రేషన్ కోసం ఎదురుచూసిన ఆస్తులకు ఏ మేరకు విముక్తి లభిస్తుంది? విచారణలో ఎలాంటి అంశాలు వెలుగులోకి వస్తాయి? అనేది ఇప్పుడు కీలకంగా మారింది.

# పదవుల పందేరం!

(మొదటి పేజీ తరువాయి)



సీనియారిటీతోపాటు సిన్సియారిటీని పరిగణలోకి తీసుకుంది. చివరిగా సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆమోద ముద్ర తో ప్రకటన చేయాలని భావిస్తోంది. సుమారు 50 కార్పొరేషన్లకు సంబంధించి నియామకాలు లేవు. అందుకే వాటి పై ఆశలు పెట్టుకున్న నేతలకు నిరాశ ఎదురవుతోంది. మరోవైపు ఎమ్మెల్యేలపై క్షేత్రస్థాయిలో ఒత్తిడి పెరుగుతోంది. ఇంకోవైపు పార్టీలో అసంతృప్త స్వరం వినిపిస్తోంది.. అందుకే వీలైనంత త్వరగా పదవుల భర్తీకి ముందుకొచ్చింది అధిష్టానం. ఇందుకుగాను కీలక ప్రకటన కూడా రానుంది. వాస్తవానికి 2024 జూలైలో రెండేళ్ల కాల పరిమితికి నియమితులైన పలువురు పదవులు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే కొత్త నియామకాలపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టి సారించింది.

**సామాజిక సమీకరణలకు పెద్ద పీట..**

ఈసారి నామినేటెడ్ పదవుల్లో కుల గణన ప్రాధాన్యత సంతరించుకొనుంది. వెనుకబడిన తరగతుల వారికి ప్రధానంగా అవకాశాలు కల్పించనున్నారు. అయితే మిత్రపక్షాలకు సంబంధించి కూడా ఒకరిద్దరి పేర్లు ప్రకటించే అవకాశం ఉంది. కోదండరాం పార్టీకి సంబంధించి ఓ ఇద్దరికి చైర్మన్లుగా అవకాశం దక్కే పరిస్థితి కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడం.. సార్వత్రిక ఎన్నికల్లో సైతం సత్తా చాటాలంటే బలమైన నేతలకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టాలని ఎమ్మెల్యేలు ఒత్తిడి పెంచుతున్నారు. అయితే జిల్లాల వారీగా జాబితాలను వడబోసి టిపిసిసి నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డి తో పాటు పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లింది. అయితే దీనిపై తుది కసరత్తు చేసి.. ఈ నెల చివరిలో పదవులు ప్రకటించాలని చూస్తోంది కాంగ్రెస్ అధిష్టానం.

# వైసీపీకి శ్రీకాకుళం జడ్పీ చైర్ పర్సన్ గుడ్ బై?!

**క్రైమ్ మిర్రర్, ఉత్తరాంధ్ర:** ఉత్తరాంధ్ర నుంచి వైసీపీకి మరో నేత గుడ్ బై చెబుతారా? తెలుగుదేశం పార్టీలో చేరుతారా? ఈ మేరకు చర్చలు పూర్తయ్యాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. మొన్ననే విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను వైసీపీకి గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. తన కుమార్తెతో కలిసి టిడిపిలో చేరిన సంగతి విధితమే. ఆయన పార్టీకి గుడ్ బై చెప్పడంతో వైసీపీలో ప్రకంపనలు రేగాయి. అయితే తాజాగా శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయలక్ష్మి టిడిపిలో చేరుతారన్న ప్రచారం పెద్ద ఎత్తున ప్రారంభం అయింది. గత కొంతకాలంగా వైసీపీ పై ఆమె తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.

**నియోజకవర్గ బాధ్యతలు తప్పించి..**

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పిరియా విజయలక్ష్మి కి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పదవి వరించింది. ఆమె భర్త సాయిరాజ్ 2009లో తెలుగుదేశం పార్టీ తరఫున ఇచ్చాపురం శాసనసభ నియోజకవర్గం నుంచి గెలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఆ ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాలో టిడిపి ఓడిపోయింది. ఒక్క ఇచ్చాపురం స్థానం నుంచి సాయిరాజ్ రూపంలో టిడిపి గెలిచింది. అయితే కొద్ది రోజులకే సాయిరాజ్ వైయస్సార్ కాంగ్రెస్ గూటికి చేరారు. రెండుసార్లు ఆయన పోటీ చేశారు కానీ ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో మాత్రం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా ఉన్న విజయలక్ష్మి ఇచ్చాపురం అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అయినా ఓటమి ఎదురైంది. అయితే గత రెండు సంవత్సరాలుగా ఇచ్చాపురం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగు తూ వచ్చారు. కానీ ఇటీవల జగన్మోహన్ రెడ్డి అక్కడ నాయకత్వాన్ని మార్చారు. సాడిశ్యాం ప్రసాద్ రెడ్డి అనే కొత్త నేతకు బాధ్యతలు కట్టబెట్టారు. అప్పటినుంచి పిరియా విజయలక్ష్మి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం నడిచింది.

**ఇద్దరు ఎమ్మెల్యేలు హాజరు..**

జడ్పీ పాలకవర్గాలు ముగిసిన నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి ఎమ్మెల్యేలు కూన రవికుమార్, మామిడి గోవిందరావు హాజరయ్యారు. ఇటీవల కాలంలో జిల్లా పరిషత్ సమావేశంలో దూకుడుగా ఉండేవారు ఆమదాలవలస టిడిపి ఎమ్మెల్యే రవికుమార్. అటువంటి సమయంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీరుపై కూడా విరుచుకుపడిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఉన్నట్టుండి అదే జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సన్మాన కార్యక్రమానికి టిడిపి ఎమ్మెల్యేలు హాజరుకావడం హాట్ టాపిక్ అవుతోంది. పిరియా విజయలక్ష్మి, ఆమె భర్త సాయిరాజ్ త్వరలో తెలుగుదేశం గూటికి వస్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. స్థానిక సంస్థలు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో.. టిడిపి హై కమాండ్ వైసిపి కీలక నేతలపై గురిపెట్టినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ టిడిపి గూటికి రావడం ఖాయమని సమాచారం. ఇప్పటికే కాళింగ సామాజిక వర్గానికి చెందిన తమ్మినేని సీతారాం వైసిపి పై ఆగ్రహంగా ఉన్నారు. ఇప్పుడు అదే బాటలో అదే సామాజిక వర్గానికి చెందిన పిరియా సాయిరాజ్, విజయలక్ష్మి దంపతులు ఉండడం సంచలనగా మారింది. వారు వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరితే శ్రీకాకుళం జిల్లా పరిణామాలు శరవేగంగా మారడం ఖాయం.



# కాంగ్రెస్‌లో 'ఎమ్మెల్సీ' సందడి!

మార్చిలో రెండు స్థానాలు ఖాళీ కానున్నాయి. సాధారణంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు ఆరు నెలలు ముందు నుంచే ప్రారంభం అవుతాయి. ఎందుకంటే ప్రతి ఎన్నికలకు అక్కడ ఓట్ల జాబితా మారుతూ ఉంటుంది. కొత్త ఓట్లు చేర్చాల్సి ఉంటుంది. పాత ఓటర్లు సైతం నమోదు కావాల్సి ఉంటుంది. అయితే రాజకీయ పార్టీలు సైతం ముందుగానే అభ్యర్థులను ఎంపిక చేస్తాయి. ఈ కొత్త ఓట్ల చేరిక బాధ్యతలను అభ్యర్థులే చూసుకుంటారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. ఈ రెండు నియోజకవర్గాలకు సంబంధించి.. ఒక్కో నియోజకవర్గానికి మూడు పేర్లతో ప్రతిపాదనలు పంపాలని అధిష్టానం సూచించింది.

**ఎన్నికలకు సన్నాహాలు..**

హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం.. వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల స్థానాలకు 2027 మార్చి తో గడువు ముగియనుంది. కేంద్ర ఎన్నికల సంఘం మరో రెండు మూడు నెలల్లో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టేందుకు సమాయత్తం అవుతుంది. రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, ఓటర్ల నమోదు బాధ్యతల పై ముందస్తు చర్చలు జోరందుకుంటున్నాయి. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికల తరహాలో ఉండవు. ప్రతి ఆరేళ్లకు ఒకసారి పాత ఓటర్ల జాబితా రద్దయి.. కొత్తగా ఫారం ఎయిటీన్ ద్వారా వాటర్ లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

**ఆశావహులు అధికం..:** ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి అధికార కాంగ్రెస్లో ఆశావహుల సంఖ్య అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో ఒక్కో నియోజకవర్గానికి మూడు పేర్లతో ప్రతిపాదనలు పంపాలని అధిష్టానం సూచించింది. ఖమ్మం- వరంగల్- నల్గొండ స్థానానికి సంబంధించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. మహబూబ్ నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ స్థానానికి ఇన్చార్జిగా మంత్రి దామోదర్ రాజనర్సింహ లకు అభ్యర్థుల వడబోత బాధ్యతను అప్పగించారు. వారు పోటీకి ఆసక్తి చూపుతున్న ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మూడు పేర్లు చొప్పున ఎంపిక చేసి అధిష్టానానికి పంపిస్తారు. వాటిపై పిసిసి అధ్యక్షుడు సీఎం రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత ఏఐసీసీ నాయకత్వానికి పంపించనున్నారు. మహబూబ్ నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ నియోజకవర్గం నుంచి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు బరిలో దిగుతారని ప్రచారం జరుగుతోంది. అక్కడ బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని కాంగ్రెస్ చూస్తోంది. సామ రామ్మోహన్ రెడ్డి, హర్షవర్ధన్, గౌరీ సతీష్, వేణుగోపాల్ రెడ్డి, భీమ్ భారత్ ఆశావహులుగా ఉన్నారు. ఖమ్మం- వరంగల్- నల్గొండ నియోజకవర్గానికి పిసిసి అధికార ప్రతినిధి లోకేష్ యాదవ్, గుప్త అమిత్ రెడ్డి, చలగాని దయాకర్, కైలాష్ నేత, ఒక మంత్రి సోదరుడి పేరు బలంగా వినిపిస్తోంది.

# అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** అగ్రిగోల్డ్ బాధితులకు గుడ్ న్యూస్. అగ్రిగోల్డ్ ప్లాట్ లకు సంబంధించి ఏపీ క్యాబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్లాట్లు కొనుగోలు చేసేందుకు డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఊరట కల్పించింది. వీరి భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించింది. అగ్రిగోల్డ్ పై ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ అమరావతి సచివాలయంలో సమావేశం అయింది. తొలి విడతలో భాగంగా మొత్తం 35 వేల 544 మంది బాధితులకు లబ్ధి చేకూరనుంది. మరో 6989 మంది ప్లాట్లు కొనుగోలు చేయడానికి డబ్బులు చెల్లించినా.. వారికి రిజిస్ట్రేషన్లు చేయలేదు. వీరికి రెండో విడతలు లైన్ క్లియర్ కానుంది. ఏపీతోపాటు తెలంగాణ, మిగిలిన రాష్ట్రాలలో 20 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి బాధితుల నుంచి బాండ్ల వివరాలు సేకరించాలని ఏపీ క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించడం విశేషం.

**దశాబ్ద కాలంగా..:** అగ్రిగోల్డ్ దశాబ్ద కాలంగా నలుగుతున్న సమస్య. దానిని పూర్తిగా పరిష్కారం చేస్తానని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2018 పాదయాత్రలో హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదివేల రూపాయల లోపు డిపాజిట్లకు మాత్రమే చెల్లింపులు చేశారు. తర్వాత నాలుగేళ్లపాటు నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దానిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. బాధితులందరికీ డిపాజిట్లు వెనక్కి ఇచ్చేందుకు నిర్ణయించింది. తాజాగా క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశమై కీలక నిర్ణయం తీసుకుంది. అగ్రిగోల్డ్ బాధితులనుంచి బాండ్ల వివరాలు సేకరించడానికి ఏపీలో ఏడు, తెలంగాణలో 3.. ఒడిస్సా,, తమిళనాడు, కర్ణాటక, ఇతర రాష్ట్రాల్లో పది టీములు ఏర్పాటు చేస్తారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి అగ్రిగోల్డ్ డిపాజిట్లు చేసిన, పెట్టుబడులు పెట్టిన బాధితుల ఒరిజినల్ బాండ్లు చూపించి వాటి జిరాక్సు అందజేయాల్సి ఉంటుంది. గతంలో అగ్రిగోల్డ్ భూముల్లో మొక్కలు నాటగా.. ఆ భూముల్లో అటవీ శాఖ అధికారులను నోడల్ అధికారులుగా నియమించి ప్లాంటేషన్ ను ఆడిట్ చేయించనున్నారు. అగ్రిగోల్డ్ మున్సిపల్ ఏరియాలో వేసిన లేఅవుట్లు ప్రస్తుతం ఏ పరిస్థితుల్లో ఉన్నాయో మున్సిపల్ అధికారులతో సమీక్ష చేయనున్నారు. అగ్రిగోల్డ్ లో డిపాజిట్లు చేసి నష్టపోయిన ప్రతి లబ్ధిదారులకు ఉపశమనం కల్పిస్తామని క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యురాలు, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. చివరి డిపాజిట్ దారుడు వరకు న్యాయం చేస్తామని చెప్పారు.

**చాలా రాష్ట్రాల్లో బాధితులు..:** అగ్రిగోల్డ్ బాధితులు దశాబ్దాలుగా ఎదురు చూస్తూనే ఉన్నారు. కేవలం ఏపీ మాత్రమే కాదు దాదాపు దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రిగోల్డ్ పెద్ద ఎత్తున డిపాజిట్లు సేకరించింది. ఒకవైపు డిపాజిట్లు సేకరిస్తూనే స్థిరాస్తి వ్యాపారంలో అడుగుపెట్టింది. భారీగా భూములు కొనుగోలు చేసింది కూడా. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకుగాను ప్లాట్లను తక్కువ ధరకు అందించేందుకు సులభ వాయిదా పద్ధతుల్లో కూడా డిపాజిట్లు సేకరించింది. ప్రారంభంలో మెరుగైన సేవలు అందించడంతో అగ్రిగోల్డ్ విస్తరణ శరవేగంగా జరిగింది. అయితే ఒక్కసారిగా అగ్రిగోల్డ్ తన కార్యకలాపాలను నిలిపివేసింది. దీంతో వేలాదిమంది లబ్ధిదారులు, వేలాదిమంది ఏజెంట్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. డిపాజిట్లు వెనక్కి రాకపోవడంతో ఏజెంట్ల పై ఒత్తిడి పెరిగింది. దీనిని భరించలేక రాష్ట్రవ్యాప్తంగా చాలామంది ఏజెంట్లు బలవన్మ ాణాలకు కూడా పాల్పడ్డారు. కూటమి వచ్చిన తర్వాత అగ్రిగోల్డ్ విషయంలో ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. సమస్యల అధ్యయనంతో పాటు పరిష్కార మార్గం చూపేందుకు సీఎం చంద్రబాబు క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు సమావేశం అవుతున్న ఈ క్యాబినెట్ సబ్ కమిటీ కీలక సూచనలు చేస్తూ వస్తోంది. తాజాగా సమావేశమైన ఈ కమిటీ డిపాజిటర్ల బాండ్లు పరిశీలనకు ప్రత్యేక అధికార బృందాలను నియమించడం విశేషం.

# విదేశాలకు సీఎం చంద్రబాబు!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ సీఎం చంద్రబాబు విదేశీ పర్యటనకు వెళ్తున్నారు. కుటుంబ సమేతంగా విదేశాలకు వెళ్ళనున్నారు. ఈనెల 25న ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజులపాటు విదేశాల్లో గడపనున్నారు. అధికారిక వ్యవహారాలతో ఎలాంటి సంబంధం లేకుండా.. పూర్తిగా వ్యక్తిగత పర్యటన కావడంతో ముఖ్యమంత్రితో పాటు ఆయన కుటుంబ సభ్యులు మాత్రమే ఈ టూర్లో పాల్గొంటున్నారు. నిరంతరం సమీక్షలు, జిల్లాల పర్యటనలు, ప్రజా సమస్యల పరిష్కారంలో బిజీగా గడుపుతుంటారు చంద్రబాబు. అందుకే కొద్ది రోజులపాటు కుటుంబంతో గడిపేందుకు ఈ చిన్న విరామాన్ని కేటాయించినట్లు తెలుస్తోంది. అయితే ఇది వ్యక్తిగత పర్యటన కావడంతో షెడ్యూల్ మాత్రం బయటకు రాలేదు.

**వివరాలు బయటకు రాలే..**

ప్రతి సంవత్సరం సీఎం చంద్రబాబు విదేశీ పర్యటనలకు వెళుతుంటారు. అయితే తాజా పర్యటన పూర్తిగా ప్రైవేటు వ్యవహారం కావడంతో సీఎం ఏ దేశానికి వెళుతున్నారు? ఎక్కడ బస చేయనున్నారు అనే షెడ్యూల్ వివరాలను అధికార యంత్రాంగం అత్యంత గోప్యంగా ఉంచింది. ఎలాంటి అధికారిక ప్రోటోకాల్స్, ప్రభుత్వ ప్రతినిధి బృందాలు లేకుండా కేవలం వ్యక్తిగత సిబ్బంది పర్యవేక్షణలోనే ప్రయాణ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రైవేటు టూర్ కారణంగా ఎలాంటి బహిరంగ సమావేశాలు, రాజకీయ భేటీలు ఉండవని.. కేవలం కుటుంబ సభ్యులతో గడిపేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారని సమాచారం.

**28న తిరిగి అమరావతికి..**

అయితే చంద్రబాబు విదేశీ పర్యటనకు సంబంధించి కేవలం ఆయన భార్య భువనేశ్వరి మాత్రమే పరిమితం అవుతారా? లేకుంటే కొడుకు లోకేష్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ కూడా వెళ్తారా? అన్నది మాత్రం తెలియడం లేదు. సీఎం చంద్రబాబు మూడు రోజుల విదేశీ పర్యటనను ముగించుకొని ఈ నెల 28న తిరిగి అమరావతికి చేరుకోనున్నారు. తిరిగి వచ్చిన వెంటనే ఆయన యథావిధిగా ప్రభుత్వ పాలనా సమీక్షలు, ప్రాజెక్టుల పురోగతి పరిశీలనలు, మంత్రివర్గ కార్యాచరణలో భాగస్వామ్యం కానున్నారు. వరుసగా ఐదు రోజులపాటు జిల్లాల్లో పర్యటించనున్నారు. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మళ్లీ అధికారిక కార్యక్రమాల్లో బిజీ అయ్యారు. కొద్దిరోజులపాటు కేరళలో ప్రత్యేక ప్రకృతి వైద్యం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అధికారిక, రాజకీయ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటున్నారు. ఇటీవల కాకినాడ వేదికగా స్థానిక సంస్థలకు సంబంధించి పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మూడు రోజులపాటు వ్యక్తిగత పర్యటన నిమిత్తం సీఎం చంద్రబాబు విదేశాలకు వెళ్తున్నారు. ఈ మూడు రోజులపాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. కానీ ఎంతవరకు అధికారికంగా ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదు.

# విద్యుత్ ఎమర్జెన్సీ!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ :** ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి తెలుగు రాష్ట్రాలకు. కనీస స్థాయిలో కూడా వర్షాలు పడలేదు. ఒక్క తెలుగు రాష్ట్రాలకే కాదు.. మొత్తం దక్షిణ భారతదేశం పై ఈ ప్రభావం పడింది. లోటు వర్షపాతం నమోదయింది. నైరుతి రుతుపవనాల ప్రభావం కూడా లేకుండా పోయింది. మరోవైపు ఉష్ణోగ్రతలు పెరగడంతో విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో దక్షిణ భారతదేశంలో తీవ్రమైన విద్యుత్ సంక్షోభం తలెత్తుతోంది. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే ముందే ఎండలు తీవ్ర రూపం దాల్చడం.. ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరడం దక్షిణ భారత గ్రిడ్ ను పెను ఒత్తిడిలోకి నెట్టేసింది. దాని మూలంగానే తీవ్ర విద్యుత్ సంక్షోభం ఏర్పడింది. సాధారణంగా మార్చి, ఏప్రిల్ తర్వాత విద్యుత్ డిమాండ్ పెరుగుతూ ఉంటుంది. కానీ ఇప్పుడు వర్షాలు లేకపోవడంతో వేసవికి మించి అన్నట్టు గరిష్ట స్థాయిలకు చేరుకుంది.

**వేసవికి మించి..**

దక్షిణ భారతదేశంలో వేసవిని తలపించినట్టు వర్షాకాలంలో పరిస్థితి ఉంది. వ్యవసాయ పంపుసెట్లకు రికార్డు స్థాయిలో విద్యుత్ వాడకం పెరిగింది. గృహ, వాణిజ్య రంగాల్లో ఎయిర్ కండిషనర్ల వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో.. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లతో పాటు కేరళలోనూ విద్యుత్ సమతుల్యత దెబ్బతిని.. గ్రేట్ నిర్వహణ అధికార యంత్రాంగానికి సవాల్ గా మారింది. పారిశ్రామిక హక్కుగా ఉన్న తమిళనాడులో పరిస్థితి చేయి దాటుతోంది. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా మీకు డిమాండ్ ఏకంగా 19,000 నుంచి 20వేల మెగావాట్లకు పైగా చేరుకుంది. ఉత్పత్తి, వినియోగం మధ్య తీవ్ర అంతరాయం ఏర్పడింది. సెంట్రల్ గ్రిడ్ నుంచి కేటాయింపులు తగ్గడం, థర్మల్ ప్లాంట్లలో సాంకేతిక



అంతరాయాలు తోడు కావడంతో పారిశ్రామిక ప్రాంతాలు, గ్రామీణ జిల్లాల్లో అనధికారికంగా విద్యుత్ కోతలు అమలు అవుతున్నాయి. రోజుకు నాలుగు నుంచి ఆరు గంటల పాటు సరఫరా నిలిచిపోతుండడంతో పారిశ్రామిక రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. బహిరంగ మార్కెట్లో యూనిట్ విద్యుత్ ధర గరిష్ట పరిమితి అయిన పది రూపాయలకు చేరుకున్నప్పటికీ.. విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర డిస్కం లకు ఆర్థిక భారం మోయలేని స్థాయికి చేరుకుంది.

**తెలుగు రాష్ట్రాల్లో గడ్డు పరిస్థితులు..**

మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో సైతం గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణతో పాటు ఏపీలో కూడా పరిస్థితి క్లిష్టంగా మారుతుంది. తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా, వేగంగా విస్తరిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గృహ వినియోగం కలగలిపి విద్యుత్ వినియోగం రికార్డ్ స్థాయికి చేరుకుంది. 15,500 మెగావాట్లకు దాటి దూసుకెళ్తోంది. దీంతో క్షేత్రస్థాయిలో వ్యవసాయ ఫీడర్లకు రాత్రి వేళల్లో సరఫరా కుదింపులు, గ్రామీణ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరుతో సరఫరాను నిలిపివేయాల్సి వస్తోంది. ఏపీలో కూడా పరిస్థితి నానాటికి తీసుకట్టుగా మారుతుంది. ఏకంగా విద్యుత్ వినియోగం దాదాపు 240 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. దీంతో విద్యుత్ను అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. బొగ్గు నిల్వల కొరత, థర్మల్ ఉత్పత్తి పై ఒత్తిడి వల్ల ఏపీలోని గ్రామీణ, పట్టణ శివారు ప్రాంతాల్లో లో లోడ్ షెడ్డింగ్ సంకేతాలు కనిపిస్తున్నాయి.

**డెడ్ స్టోరేజ్ కి జలాశయాలు..**

కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని సంక్షోభం పూర్తిగా పతాక స్థాయికి చేరుకుంది. హైడ్రో పవర్ వైఫల్యంతో పరిస్థితి మరింత క్షీణిస్తోంది. కర్ణాటక రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో కీలక పాత్ర పోషించే లింగనమక్కి, సుపా జలాశయాల్లో నీటిమట్టం డెడ్ స్టోరేజ్ కు చేరుకుంది. జల విద్యుత్ ఉత్పత్తి దాదాపు 40 శాతం మేర పడిపోయింది. దీంతో బెంగళూరు ఐటి కారిడార్ తో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే తీవ్రమైన విద్యుత్ కోతలు మొదలయ్యాయి. మరోవైపు కేరళలో పరిస్థితి దిగజారుతోంది. ఆ రాష్ట్ర విద్యుత్ అవసరాలలో 70 శాతానికి పైగా జలవిద్యుత్ పైనే ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర ప్రధాన జలాశయమైన ఇడుక్కితో పాటు ఇతర డ్యామ్లలో నీటి నిల్వలు 30 శాతానికి కంటే తక్కువ పడిపోయాయి. రోజువారి డిమాండ్ 100 మిలియన్ యూనిట్లను దాటుతుండగా.. స్థానిక ఉత్పత్తి పడిపోవడంతో కేరళ విద్యుత్ బోర్డ్ రోజుకు దాదాపు 20 కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి బయట నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

**ఇలా అయితే కష్టం..**

విద్యుత్ పరంగా దక్షిణ భారతదేశ ప్రమాదం అంచున పొంచి ఉంది. ఒక విద్యుత్ ఎమర్జెన్సీ అంచున నిలబడి ఉంది. దక్షిణ భారత ప్రాంతీయ గ్రిడ్ మొత్తం ఏకంగా 65 వేల మెగావాట్లను అధిగమించి కొత్త గరిష్టలను నమోదు చేస్తోంది. కేంద్రం నుంచి అత్యవసర బొగ్గు కేటాయింపులు పెంచడం.. అంతర్ ప్రాంతీయ ట్రాన్స్మిషన్ కారిడార్ల ద్వారా ఉత్తర భారత నుంచి మిగులు విద్యుత్తును తరలించడం, డిస్కం లు కఠినమైన డిమాండ్, మేనేజ్మెంట్ విధానాలు అమలు చేయకపోతే పారిశ్రామిక రంగానికి ఇబ్బందులు తప్పవు. భారీ బ్లాక్ అవుట్ల ముప్పును ఎదుర్కోక తప్పదు.

# తేలనున్న భూ ఆక్రమణల లెక్క!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. గులాబీ పార్టీ హయాంలో భూ రికార్డుల అవకతవకలు, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూ కేటాయింపులు, రిజిస్ట్రేషన్ లో ఉల్లంఘనలపై రేవంత్ సర్కార్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. గులాబీ పార్టీ నేతలు దొరికింది దొరికినట్లుగా భూములు కొల్లగొట్టారు అన్న ఆరోపణలు రావడంతో.. విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేశారు. ప్రభుత్వ అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల ఆక్రమణలతోపాటు ప్రైవేటు పట్టా భూముల్లో జరిగిన అక్రమ మార్పులపై నిగ్గు తేల్చేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన ప్రత్యేక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సీనియర్ ఐఏఎస్ అధికారిణి దేవసేన చైర్మన్గా ఉంటారు. రాజీవ్ గాంధీ హనుమంతుని ఈ కమిటీ కన్వీనర్ గా నియమించారు.

**గత కొంతకాలంగా వివాదాలు..**

గత కొంతకాలంగా తెలంగాణలో భూ వివాదాలు, భూ ఆక్రమణల చుట్టూ రాజకీయం నడుస్తోంది. ప్రధానంగా గులాబీ పార్టీ హయాంలో భారీ భూదోపిడి జరిగిందన్నది కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపణ. కెసిఆర్ ఫ్యామిలీ అక్రమ దందాను ఆధారాలతో సహా బయటపెట్టి సీఎం రేవంత్ రెడ్డి సంచలనం సృష్టించారు. అప్పట్లో ధరణి పోర్టల్, నిషేధిత భూములకు సంబంధించి.. జరిగిన నిబంధనల ఉల్లంఘనలను సమగ్రంగా పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ చట్టాలను తుంగలో తొక్కి చేసిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తుల పరం చేసిన వైనం, లేఅవుట్ అనుమతుల్లో జరిగిన అక్రమాలు, రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో అందిన ఫిర్యాదులు, విజిలెన్స్ నివేదికలతో పాటు క్షేత్రస్థాయి పరిశీలనలను ప్రాతిపదికగా తీసుకొని.. నివేదికలు సిద్ధం చేయాలని ఆ జీవోలో స్పష్టం చేశారు.

**క్షుణ్ణంగా దర్యాప్తు..**

ఈ కమిటీ గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై క్షుణ్ణంగా దర్యాప్తు చేయనుంది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల సమన్వయంతో కీలక దస్త్రాలను, వివాదాస్పద సర్వే నంబర్ల డాక్యుమెంట్లను పరిశీలించి కమిటీలను వేగవంతం చేయనుంది. ఎక్కడెక్కడ ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి భూములు చేతులు మారాయి? వీటి వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు? అక్రమాలకు సహకరించిన అధికార యంత్రాంగం, దళారుల పాత్ర ఎంతవరకు ఉంది? అనే అంశాలపై ఆరాధిసి బాధ్యులపై చర్యలకు సిఫార్సులు చేయనున్నారు. వివాదాస్పద భూములను గుర్తించి వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు.. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా సరికొత్త కఠిన నిబంధనలను కూడా ఈ కమిటీ ప్రభుత్వానికి సూచించనుంది.

# దానం ఎపిసోడ్‌లో బీఆర్ఎస్‌కు బలం..

హైదరాబాద్, సెప్టెంబర్ 24: ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి సంబంధించిన దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన స్పందనను వెల్లడించారు. హైకోర్టు నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి కారణం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో ఈ తీర్పును ఆయన స్వాగతించారు. దానం నాగేందర్ అంశంపై మొదటి నుంచి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తూ ముందుకు సాగామని కౌశిక్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ మార్గనిర్దేశంలో చేపట్టిన న్యాయపరమైన చర్యల ఫలితంగానే తాజా పరిణామం చోటుచేసుకుందని పేర్కొన్నారు. ప్రజల ఓట్లతో ఒక పార్టీ తరఫున గెలిచి అనంతరం మరో పార్టీలోకి వెళ్లే ప్రజాప్రతినిధుల విషయంలో చట్టబద్ధమైన చర్యలు అవసరమన్న తమ అభిప్రాయానికి ఈ తీర్పు ప్రాధాన్యతను పెంచిందన్నారు. రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలపై కౌశిక్ రెడ్డి విమర్శలు చేశారు. బయటకు భిన్నమైన రాజకీయ వైఖరులు ప్రదర్శిస్తున్నప్పటికీ, కొన్ని అంశాల్లో రెండు పార్టీల మధ్య అవగాహనతో కూడిన వ్యవహారం కొనసాగుతోందని ఆరోపించారు. తమ రాజకీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు పరస్పరం సహకరించుకుంటున్నారని అన్నారు. కోర్టుల పనితీరుపై రాజకీయ వ్యాఖ్యలు చేయడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. న్యాయస్థానాలు కేసులను విచారించి తీర్పులు ఇవ్వడాన్ని వేగం పేరుతో విమర్శించడం సరికాదని పేర్కొన్నారు. న్యాయ ప్రక్రియను గౌరవిస్తూ తీర్పులను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టపరమైన అంశాలపై బీఆర్ఎస్ తన పోరాటాన్ని ఆపబోదని కౌశిక్ రెడ్డి వెల్లడించారు. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా కేసీఆర్ నాయకత్వంలో న్యాయపరమైన మార్గంలోనే ముందుకు సాగుతామని తెలిపారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నిక అనివార్యం!




(మొదటి పేజీ తరువాయి)

ఉప ఎన్నిక తప్పదని తేలిపోయింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటును అత్యున్నత న్యాయస్థానం సైతం సమర్థించింది. కొద్ది రోజుల కిందట తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్ పై అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. గులాబీ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన దానం నాగేందర్ పై హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణ సాగింది. దీంతో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ కీలక తీర్పు చెప్పింది. అయితే దీనిని సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఆ పిటిషన్ ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని.. ఉప ఎన్నికకు వెళ్లాల్సిందేనట్టు స్పష్టం చేసింది. దేశంలోనే అత్యంత ప్రముఖ, ఖరీదైన న్యాయవాదిగా పేరుపొందిన ముకుల్ రోహత్గీ రంగంలోకి దిగి వాదనలు వినిపించినా.. దానం నాగేందర్ కు ఎలాంటి ఉపశమనం లభించలేదు.

**దక్కని ఊరట..**

వాస్తవానికి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పుడే చాలామంది న్యాయ నిపుణులు తప్పు అని వారించారు. ఆశ్రయించడాన్ని తప్పుపట్టారు. అయినా సరే దానం నాగేందర్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తొలుత స్పీకర్ నిర్ణయం పై జస్టిస్ బాగ్చీ తెలంగాణ స్పీకర్ ఇచ్చిన ఆర్డర్ నన్ను నిజంగా ఆకట్టుకుంది అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీనిపై న్యాయవాది రోహత్గీ స్పందించారు. పార్టీ క్రమశిక్షణ లేదా ఫిరాయింపుల్లో క్షమాపణ అనే ఒక కాన్సెప్ట్ ఉంటుందని వాదించే ప్రయత్నం చేశారు. దీనిపై న్యాయమూర్తి ఘర్ వాపసి గురించా మీరు చెబుతున్నది అని సూటిగా ప్రశ్నించారు. దీనిపై రోహత్గీ బదులిచ్చారు. దానం నాగేందర్ ఇప్పటికీ తన సొంత పార్టీతోనే ఉన్నారు.. పార్టీ సమావేశాలకు హాజరవుతున్నారు.. పార్టీ కూడా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు అంటూ వాదనలు వినిపించారు. కానీ న్యాయస్థానం మాత్రం ఒక పార్టీ ఎమ్మెల్యేగా పోటీ చేసి.. మరో పార్టీ ఎంపీగా ఎలా బరిలో దిగుతారు అంటూ ప్రశ్నించింది. ఇది తప్పుడు చర్యగా అభివర్ణిస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ పిటిషన్ ను కొట్టివేసింది. దీంతో ఖైరతాబాద్ ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. తప్పదు అని తేలిపోయింది.

**అగ్ని పరీక్షలా..**

అయితే ఇప్పుడు అందరి దృష్టి ఖైరతాబాద్ పై పడింది. ఎలాగైనా ఈ స్థానాన్ని గెలుచుకోవాలి. అటు అధికార కాంగ్రెస్ పార్టీకి.. ఇటు గులాబీ దళానికి అగ్నిపరీక్ష. మరోవైపు ఎలాగైనా అధికారంలోకి వస్తామన్న ధీమాతో ఉన్న బిజెపికి కూడా ఇది ఎంతో ప్రతిష్టాత్మకం. కాంగ్రెస్ పార్టీ తన పట్టు నిలుపుకోవాలి అనుకుంటే కచ్చితంగా గెలవాల్సిందే. రాష్ట్రంలో అనూహ్యంగా బలం పుంజుకున్నట్లు భావిస్తోంది బీఆర్ఎస్. దానిని నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పైగా దానం నాగేందర్ పై అనర్హత వేటు వేసేలా ఎక్కువగా న్యాయపోరాటం చేసింది ఆ పార్టీ. అలా ఖాళీ అయిన ఆ స్థానాన్ని భర్తీ చేయాల్సిన అత్యవసర పరిస్థితి ఆ పార్టీకి ఉంది. ఇంకోవైపు బిజెపికి ఇది ప్రతిష్టాత్మకమే. ఎందుకంటే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆ పార్టీ నేతలు నమ్మకంగా చెబుతున్నారు. అందుకే ఆ పార్టీ సైతం ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సిందే.

# విశాఖకు మెట్రో!

దశాబ్దాలుగా విశాఖ నగరవాసులు ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక డబుల్ డెక్కర్ మెట్రో రైలు ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయాన్ని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్వయంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించడంతో ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు మార్గం సుగమం అయింది. త్వరలో క్షేత్రస్థాయి నిర్మాణ పనులను ప్రారంభించినట్లు కూడా ఆయన స్పష్టం చేశారు.

**శరవేగంగా అభివృద్ధి..**

విశాఖ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా ఐటి పరిశ్రమలు వచ్చాయి. పర్యాటక ప్రాజెక్టుల సైతం నిర్మాణ పనులు జరుపుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు కూడా భారీగా ఏర్పాటు అవుతున్నాయి. అదే సమయంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సైతం అందుబాటులోకి వచ్చింది. ఒకవైపు ఐటీ ఉద్యోగులు, ఇంకోవైపు పర్యాటకుల తాకిడి పెరగనున్న నేపథ్యంలో.. భవిష్యత్తులో ట్రాఫిక్ అవసరాలు దృష్టిలో ఉంచుకొని మెట్రో రైల్వే ప్రాజెక్ట్ నిర్మాణ పనులు చేపట్టాలని ఎప్పటినుంచో ప్రతిపాదనలు ఉన్నాయి. విభజన హామీల్లో భాగంగా మెట్రో రైలు ప్రాజెక్టు హామీ ఉంది. ఇన్నాళ్లకు అది కార్యరూపం దాల్చింది. అత్యాధునిక ఇంజనీరింగ్ ప్రమాణాలతో ఈ ప్రాజెక్టును డిజైన్ చేస్తున్నారు. ఒకే పిల్లర్ పై దిగువున ఫ్లై ఓవర్ రోడ్డు మార్గం, ఎగువన మెట్రో రైల్ క్యారిడార్ వెళ్లేలా డబుల్ డెక్కర్ విధానాన్ని అమలు చేయనున్నారు. భూ సేకరణ సమస్యలు, భారీ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు.. ఇరుకైన కారిడార్లలో సాధారణ రోడ్డు రవాణా, ప్రజా రవాణా రెండింటికి ఇది శాశ్వత పరిష్కార మార్గంగా నిలవనుంది.

**అన్ని ప్రాంతాలకు అనుసంధానం..**

విశాఖ నగరం భారీగా విస్తరించి ఉంది. తగరపువలస నుంచి మళ్లీ అనకాపల్లి వరకు విశాఖ నగర విస్తీర్ణం వందల కిలోమీటర్లు. ఈ మెట్రో కారిడార్ ద్వారా నగరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, ఐటీ కారిడార్లు, విద్యా సంస్థలు, పోర్టు ప్రాంతం, ప్రతిపాదిత భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అనుసంధానానికి విస్తృతమైన లబ్ధి చేకూరనుంది. రోడ్డు ట్రాఫిక్ తీవ్రతను గణనీయంగా తగ్గించడంతోపాటు సామాన్యులు, ఉద్యోగులు తక్కువ సమయంలో సురక్షితంగా, కాలుష్య రహితంగా ప్రయాణించేందుకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకం. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ హబ్ గా, ఏపీ ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలన్న కూటమి ప్రభుత్వ సంకల్పానికి కేంద్రం ఆమోదం మరింత వేగాన్ని చేకూర్చింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో శరవేగంగా నిధుల సమీకరణ పూర్తిచేసి.. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ మెట్రో ప్రాజెక్టు పూర్తితో వైజాగ్ రూపురేఖలు అంతర్జాతీయ స్థాయిలో మెట్రోపాలిటన్ నగరాల సరసన నిలవడం ఖాయమని అర్థం అవుతుంది.


GHMC
hmda Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# హయత్‌నగర్‌లో వైభవంగా గణనాథుడి శోభాయాత్ర

**నృత్యాలు.. భక్తి నినాదాలతో మార్మోగిన వీధులు**

**ఘనంగా ముగిసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు**

**డ్రెస్ కోడ్‌తో ఆకట్టుకున్న కాలనీవాసులు**



క్రైమ్ మిర్రర్, హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని సూర్యనగర్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాథుడి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. సూర్యనగర్ కాలనీ ఈస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నిమజ్జనోత్సవంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి, ఐక్యతను చాటారు. కాలనీ అధ్యక్షుడు ఐతగోని యాదగిరి గౌడ్ ఉత్సవాల నిర్వహణలో అసోసియేషన్ సభ్యులు, మహిళలు, యువత, కాలనీవాసులను సమన్వయం చేస్తూ ముందుండి కార్యక్రమాన్ని నడిపించారు. నవరాత్రి ఉత్సవాల నుంచి నిమజ్జన శోభాయాత్ర వరకు ఏర్పాట్లను సభ్యులతో కలిసి పర్యవేక్షిస్తూ వేడుకలు సజావుగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. శోభాయాత్రలో కాలనీవాసులు ఒకే రకమైన డ్రెస్ కోడ్‌తో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, యువత, చిన్నారులు భక్తిగీతాలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో కాలనీ వీధులు మార్మోగాయి. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తిగీతాలు, నృత్య ప్రదర్శనల నడుమ విగ్రహాన్ని ఊరేగించి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఐతగోని యాదగిరి గౌడ్, యాదగిరి రెడ్డి, దశరథ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, బీరప్ప, యాదగిరి ఆచారి, అమృత రెడ్డి, మల్లేష్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ వెంకట్ యాదవ్ ని సన్మానించిన వంగూరి శంకర్ యాదవ్

క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి : తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ గా ఎన్నికైన చలకాని వెంకట్ యాదవ్ ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య, మేడబోయిన శ్రీనివాస్ యాదవ్, వంగూరు శంకర్ యాదవ్, పడిదల మురళి గురువారం వెంకట్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం పేదల పక్షాన ఉంటూ అందరి మన్ననలు పొందిన వెంకట్ యాదవ్ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ గా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని పేర్కొన్నారు.

## ఏర్వగూడలో ఘనంగా వినాయక నిమజ్జనం

**ఏర్వగూడ సర్పంచ్ మన్నే పద్మ పాండు**



క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలం ఏర్వగూడ గ్రామంలో గురువారం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏర్వగూడ గ్రామపంచాయతీ సర్పంచ్ మన్నె పద్మ పాండు హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మన్నె పద్మ పాండు మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని, గణనాథుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల కోసం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన సభ్యులు ఎమ్ నర్సింలు యాదవ్, ఎమ్ సత్యనారాయణ యాదవ్, ఎమ్ రామాలింగం గౌడ్ నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాతలను గ్రామస్థులు అభినందించారు.వినాయక నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా, భక్తి వాతావరణంలో కొనసాగింది.

## భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం




సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 24: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంగారెడ్డి జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం సంగారెడ్డి జిల్లా సైన్స్ కేంద్రంలో ప్రశాంతంగా, స్నేహపూర్వక వాతావరణంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల పరిశీలకులుగా స్టేట్ అసిస్టెంట్ సెక్రటరీ జాన్ శామ్యూల్, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం, జీవన నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు. పోలీస్ శిక్షణలో మాదిరిగానే స్కౌట్స్ అండ్ గైడ్స్‌లోనూ క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, సేవా దృక్పథానికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. గత ఏడాది క్యాంపును విజయవంతంగా నిర్వహించిన బృందాన్ని అభినందించారు. స్టేట్ అసిస్టెంట్ సెక్రటరీ జాన్ శామ్యూల్ మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా రెండు వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.నూతన కార్యవర్గం: జిల్లా అధ్యక్షులుగా గౌరవ జిల్లా కలెక్టర్, జిల్లా చీఫ్ కమిషనర్‌గా డీఈఓ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, యువజన--క్రీడల అభివృద్ధి అధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ అభివృద్ధి అధికారి జగదీష్, డీపీఆర్వో విజయలక్ష్మి, ఇంటర్మీడియట్ అధికారి శ్రీనివాస్, పశువైద్యాధికారి వసంత కుమారి ఎన్నికయ్యారు. జిల్లా కమిషనర్లుగా అంజ గౌడ్, ఎలిజబెత్, జిల్లా సెక్రటరీగా మాధవ రెడ్డి, కోశాధికారిగా జీ. సుందర్ రావు, సంయుక్త కార్యదర్శిగా శోభ, ఆర్గనైజింగ్ కమిషనర్లుగా ఆంజనేయులు, వందన, ట్రైనింగ్ కమిషనర్లుగా చంద్రశేఖర్ గౌడ్, సుజాత, అసిస్టెంట్ స్టేట్ హెడ్ క్వార్టర్స్ బాధ్యులుగా వీరేశం, స్వప్నశ్రీ ఎన్నికయ్యారు.

## ఉత్తమ బోధనతో.. విద్యార్థులకు వెలుగుబాట..!!

**విద్యాబోధనలో ప్రత్యేకత చాటుతున్న ఉపాధ్యాయులు**

**లిటిల్ ఛాలెంజర్‌లో మామిడి శ్వేత, అయిత జ్యోతిక రెడ్డి**

**రైజింగ్ స్టార్‌లో కుమ్మరి జ్యోతి, ధనం ఆర్తి, రహీం మోనిసా**




క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి: విద్యాబోధనతో పాటు విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న టీచర్లు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీస్తూ, మంచి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయులు అభినందనలు అందుకుంటున్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, క్రమశిక్షణ, విద్యా ప్రమాణాలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారిస్తున్న ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయంగా నిలుస్తున్నాయి.

**లిటిల్ ఛాలెంజర్ స్కూల్..**

లిటిల్ ఛాలెంజర్ స్కూల్‌లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధిస్తూ, వారి విద్యా ప్రగతికి కృషి చేస్తున్న మామిడి శ్వేత, అయిత జ్యోతిక రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందుతున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

**రైజింగ్ స్టార్ స్కూల్..**

రైజింగ్ స్టార్ స్కూల్‌లో విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న కుమ్మరి జ్యోతి, ధనం



ఆర్తి, రహీం మోనిసా తమ బోధనా నైపుణ్యంతో ఆకట్టుకుంటున్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ, చదువుతో పాటు క్రమశిక్షణ, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.

**ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులు..**

విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, మంచి బోధనతో పాటు సరైన మార్గదర్శనం అందించే టీచర్లు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషిస్తారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

## మహిళా భవన్.. మహిళల కోసమే ఉండాలి!

**పోలీస్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయ స్థలం చూడాలి: మాజీ కార్పొరేటర్ పవన్‌కుమార్**



ఎల్బీనగర్ సెప్టెంబర్ 24(క్రైమ్ మిర్రర్): మహిళల సంక్షేమం, సాధికారత కోసం నిర్మించిన మహిళా భవన్‌ను పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు వినియోగించడంపై కొత్తపేట డివిజన్ మాజీకార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.మారుతినగర్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా భవన్‌ను స్థానిక ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు సమాచారం లేకుండా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కేటాయించడం సముచితం కాదని ఆయన పేర్కొన్నారు.మహిళల కార్యక్రమాలకు భవనం అవసరం మహిళా భవన్‌ను మహిళా సంఘాల సమావేశాలు, మహిళల కోసం అవగాహన కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, సాధికారత కార్యక్రమాలు నిర్వహించేందుకువినియోగించాల్సి ఉందని పవన్‌కుమార్ తెలిపారు. అలాంటి భవనాన్ని దాని అసలు ఉద్దేశానికి భిన్నంగా పోలీస్ స్టేషన్ కోసం కేటాయించడం వల్ల మహిళలకు అందాల్సిన సేవలు, కార్యక్రమాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.

**పోలీస్ స్టేషన్‌కు వ్యతిరేకం కాదు:** డివిజన్ ప్రజల భద్రతకు, ముఖ్యంగా మహిళల రక్షణకు పోలీస్ స్టేషన్ అవసరమేనని పవన్‌కుమార్ స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ ఏర్పాటును తాము వ్యతిరేకించడం లేదని, అయితే అందుకోసం మహిళా భవన్‌ను వినియోగించకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలని అధికారులను కోరారు.

**ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి:** ప్రజా అవసరాల కోసం నిర్మించిన భవనాల వినియోగంపై నిర్ణయాలు తీసుకునే ముందు స్థానిక ప్రజలు, మహిళా సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని పవన్‌కుమార్ కోరారు. మహిళల కోసం కేటాయించిన భవనం మహిళల సంక్షేమానికే ఉపయోగపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




## వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

**సాకి చెరువును పరిశీలించిన సైబరాబాద్ సీపీ ఎం. రమేష్**

**భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు**

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 24: వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సైబరాబాద్ పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. శుక్రవారం జరగనున్న నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో సైబరాబాద్ సీపీ ఎం. రమేష్ గురువారం పటాన్‌చెరులోని సాకి చెరువును పరిశీలించారు. డీసీపీ జ్యోతి రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ చింతమనేని శ్రీనివాస్, రామచంద్రాపురం ఏసీపీ శ్రీనివాస్‌లతో కలిసి నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ ఎం. రమేష్ మాట్లాడుతూ.. నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు, మున్సిపల్, మెట్రో వాటర్ వర్క్స్ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణతో పాటు భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు సీపీ వెల్లడించారు. భక్తులు పోలీసులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

## ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా ఉత్తమ అవార్డుల ప్రధానోత్సవం



క్రైమ్ మిర్రర్ యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:- యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మండల వారీగా ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు ఇవ్వడం జరిగింది. వెల్వర్తి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆర్ట్ టీచర్ గా పని చేస్తున్న సంగిశెట్టి రాములు కు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు మండల విద్యాధికారి జి. జలంధర్ రెడ్డి సుంకోజు. భాస్కర్ శాలువతో సన్మానం చేసి అవార్డు ఇవ్వడం జరిగింది. జిల్లా ఉత్తమ అవార్డుగా ఉపాధ్యాయులు వీరస్వామి, పిఈటి గండమల్ల స్వామి రాజ్ అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**మండల విద్యాశాఖ అధికారి గోలి శ్రీనివాస్**



క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:- యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అటెండర్,స్వీపర్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి గోలి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రెండు పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు 18 నుంచి 45 ఏళ్లు కలిగిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు.నారాయణపురం మండల స్థానిక అభ్యర్థులకు నియామకాల్లో మొదటి ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు.అర్హులైన అభ్యర్థులు తమ విద్యా అర్హతలు, ధ్రువీకరణ పత్రాల దరఖాస్తుకు జత చేసి ఈ నెల 25 నుంచి 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎం. ఆర్. సి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

# పరిశ్రమల యజమానుల లాభాలు తప్ప, ప్రజల ప్రాణాలు గురించి పట్టించుకోని పాలకులు, అధికారులు

## అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలలో ఉన్న కెమికల్ పరిశ్రమలను తొలగించే వరకు పోరాడుదాం

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా పిలుపు




**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** పాలకులకు, జిల్లా యంత్రాంగానికి కెమికల్ పరిశ్రమల యజమానుల లాభాలు తప్ప, పరిశ్రమల పొల్యూషన్ వల్ల ప్రాణాలు కోల్పోతున్న ప్రజల బతుకులపైన, దెబ్బ తింటున్నా పంట పొలాలపై ఎలాంటి పట్టింపు లేదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా విమర్శించారు. అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాల పరిధిలో ఉన్న 11 కెమికల్ పరిశ్రమలు తొలగించే వరకు ఆయా గ్రామాల ప్రజలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గురువారం పోచంపల్లి మండల పరిధిలోని దోతిగూడెం గ్రామంలో సిపిఎం శాఖ సమావేశం అనంతరం జరిగిన పొల్యూషన్ వ్యతిరేక పోరాట కమిటీ సమావేశంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ పరిశ్రమలంటే ప్రజలకు ఉపాది కల్పించే విధంగా ఉండాలి కానీ ఈ ప్రాంతంలో ఉన్న కెమికల్ పరిశ్రమలు వ్యవసాయాన్ని దెబ్బ తీస్తూ, ప్రజల ప్రాణాలను కూడా తీస్తున్నాయని విమర్శించారు. ఈ రెండు గ్రామాల పరిధిలో ఉన్న 11 కెమికల్ పరిశ్రమల రసాయన పదార్థాలు, విషవాయువులు భూగర్భ జలాల్లో కలిసి నీరు మొత్తం కలుషితమై పంటలు, పంట పొలాలు దెబ్బతింటున్నాయని, పండిన పంటలు కూరగాయలు కూడా విషముగా మారుతున్నాయని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కెమికల్స్ నిల్వ చేయడం, రక్షణ చర్యలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, స్థానిక ప్రజలు ఊపిరి ఆడక పోవడం, ఆ విష వాయు కాలుష్యం వల్ల అనేక రకాలైన జబ్బులకు గురవుతున్నారని తెలిపారు. కాలుష్యాన్ని అరికట్టవలసిన కాలుష్య నియంత్రణ మండలి పూర్తిగా విఫలమైందని కంపెనీ యజమానులతో కుమ్మక్కై పొల్యూషన్ ఎంత పరిశ్రమల నుండి వస్తుంది తెలుసుకునే యంత్రాలను కూడా పెట్టించే పరిస్థితిలో పీసీబీ జిల్లా అధికారి లేడని విమర్శించారు. జిల్లా కలెక్టర్, ఆర్డిఓ, స్థానిక శాసనసభ్యులు పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినప్పుడు, రాన నష్టం జరిగినప్పుడు వచ్చి హడావుడి చేయడము తప్ప శాశ్వతమైన పరిష్కారం చూపడం లేదని, పరిశ్రమలవల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించే పరిస్థితులు లేరని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజల బతుకులు బాగుండాలంటే, వ్యవసాయము భూములు దక్కావాలంటే పరిశ్రమలను ఈ ప్రాంతం నుండి తోలగించాలని డిమాండ్ చేసినారు. కెమికల్ పరిశ్రమలు తొలగించే వరకు ప్రజలు ఐక్యంగా పోరాడాలని, ఈ పోరాటంలో సిపిఎం ముందు వరసన ఉంటుందని నర్సింహ తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు తీస్తున్న, జల మరియు వాయు కాలుష్యానికి కారణమౌతున్న కెమికల్ పరిశ్రమలను వెంటనే తోలగించాలి, రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, నష్టపోయిన రైతులను గుర్తించడానికి రి సర్వే చేయాలని, ప్రభుత్వం నియమించిన కమిటీలో కాలుష్యానికి గురవుతున్న ప్రజలకు అవకాశం కల్పించాలని కోరుతూ అక్టోబర్ 1వ తేదీన దోతి గూడెం, అంతమ్మగూడం గ్రామాల నుండి చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం వరకు వందలాదిమందితో నిర్వహిస్తున్న " పాదయాత్ర " అనంతరం జరిగే " మహా ధర్నా" లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు ప్రసాదం విష్ణు అధ్యక్షత వహించగా సిపిఎం మాజీ మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, మండల కమిటి సభ్యులు కలుకూరి బిక్షపతి, పార్టీ సభ్యులు, ఆయా గ్రామాల సంబంధించిన రైతులు గుర్రం రామచంద్రారెడ్డి, ముద్దం సత్తయ్య, యాస మల్లారెడ్డి, గూని మల్లయ్య, గుమ్మి దామోదర్ రెడ్డి, రావుల రాంరెడ్డి, కడెం మహేష్, రావుల బాల్ రెడ్డి, వస్పరి శ్రీశైలం, అర్ల నరసింహ, వస్పరి అంజమ్మ , వస్పరి కలమ్మ, భారతమ్మ, పూజిత, జయమ్మ, రావుల ధనలక్ష్మి, కమలమ్మ, సత్తిరెడ్డి, వనమ్మ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి!

### జీవో 25ను సవరించాలి.. తరగతికో ఉపాధ్యాయుడిని నియమించాలి

### ఎఫ్ఎల్ఎన్ పాఠశాలల్లో సబ్జెక్టుకు ఒక టీచర్ ఇవ్వాలి

### విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించాలి: ఎస్జీటీయూ



**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** ఉపాధ్యాయులపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించాలని, జీవో నంబర్ 25ను వెంటనే సవరించాలని డిమాండ్ చేస్తూ ఎస్జీటీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో ఎస్జీటీయూ జంపాల రాజు పాల్గొన్నారు.

**"తరగతికో టీచర్ ఉండాల్సిందే"**

ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ఎస్జీటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ పాఠశాలల్లో ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటు కారణంగా విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలల్లో ఏర్పడుతున్న బోధనా సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే విద్యా వాలంటీర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**"బోధన కంటే బోధనేతర పనులే అధికం"**

అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా ఒకే ఉపాధ్యాయుడు బహుళ తరగతులకు బోధించాల్సి వస్తోందని నాయకులు తెలిపారు. దీనికి తోడు ప్రధానోపాధ్యాయ బాధ్యతలు, ఆన్‌లైన్ పనులు, రికార్డుల నిర్వహణ, సమావేశాలు, నివేదికలు, వరుస తనిఖీలు, ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షణ వంటి అదనపు బాధ్యతలు ఉపాధ్యాయులపై తీవ్ర పని ఒత్తిడిని పెంచుతున్నాయని పేర్కొన్నారు.

**"క్షేత్రస్థాయి సమస్యలను ప్రభుత్వం గుర్తించాలి"**

గుండాల మండలంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సమావేశం సందర్భంగా తీవ్ర ఒత్తిడికి గురైన ఘటన నేపథ్యంలో ఉపాధ్యాయుల పని పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఎస్జీటీయూ నాయకులు కోరారు. ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధించే అవకాశం కల్పించాలని, బోధనేతర పనులను తగ్గించాలని డిమాండ్ చేశారు.

**"ప్రభుత్వానికి ఎస్జీటీయూ ప్రధాన డిమాండ్లు"**

జీవో నంబర్ 25ను పునఃపరిశీలించి సవరించాలి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ పాఠశాలల్లో సబ్జెక్టుకు ఒక టీచర్‌ను ఇవ్వాలి ఎస్జీటీలపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించాలి విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించాలి ఎఫ్ఎల్ఎన్ తనిఖీల పేరుతో అదనపు ఒత్తిడిని తగ్గించాలి బోధనేతర పనులను నియంత్రించి బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం ద్వారా కాకుండా.. తగినంత మంది ఉపాధ్యాయులను నియమించి, బోధనకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారానే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించగలం."" ఎస్జీటీయూ నాయకులు జంపాల రాజు,వై శ్రీధర్,ఈ సుధాకర్, మంజుల, వేణు, క్రిష్ణ, శ్రీనాథ్, సుధాకర్, తిరుపతి, ప్రియాంక,నవ్య,లక్‌పతి,జజీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి. ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజీ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595


# గణేష్ నిమజ్జన ప్రాంతాల్లో సైబరాబాద్ సీపీ డా. యం. రమేష్ పర్యవేక్షణ

### నిమజ్జనం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి



**క్రైమ్ మిర్రర్ సైబరాబాద్ :**గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాట్లను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్ గురువారం స్వయంగా పరిశీలించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు.నార్సింగి నెట్లంపూర్ చెరువు, కోకాపేట చెరువు, అమీన్పూర్ పరిధిలోని రాయసముద్రం లేక్, సాకి చెరువు, పటాన్‌చెరు, చందానగర్‌లోని గంగారం చెరువుతో పాటు నార్సింగి, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నిమజ్జన ప్రాంతాలను సీపీ సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు.పోలీసులతో పాటు విద్యుత్, రెవెన్యూ, వైద్య, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీపీ సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు.నిమజ్జనాలను ఆసరాగా చేసుకుని ఆకతాయితనానికి పాల్పడేవారు, దొంగతనాలకు పాల్పడే ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సీపీ స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను నిశితంగా గమనించి, నేరాలకు పాల్పడే వారిని గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నిమజ్జనం పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సీపీ అధికారులను ఆదేశించారు.



# విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం

### పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 24: టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో సంగారెడ్డి జిల్లాకు చెందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్న విద్యార్థులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అభినందించారు.పాఠశాల స్థాయిలో జెడ్పీహెచ్ఎస్ గుమ్మడిదల విద్యార్థులు ప్రథమ బహుమతి, జెడ్పీహెచ్ఎస్ (బి) జోగిపేట విద్యార్థులు ద్వితీయ బహుమతి, జెడ్పీహెచ్ఎస్ సింగీతం/కలబ్‌గూర్ విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. కళాశాల స్థాయిలో తారా డిగ్రీ కళాశాల, సంగారెడ్డి ప్రథమ బహుమతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్‌చెరు ద్వితీయ బహుమతి, ఎంజేపీటీ కోహీర్ తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. చదువుతో పాటు వివిధ పోటీలు, సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభను మరింతగా పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. విజేత విద్యార్థులను ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యాశాఖ అధికారులు అభినందించారు. టూరిజం ఇన్‌చార్జి అధికారి కె.ఏ.వి.ఎస్. ప్రసాద్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా విద్యార్థులకు అవగాహన





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ), హైదరాబాద్‌లో నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించేందుకు యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని కళాశాల అసెంబ్లీ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా షాద్‌నగర్ జోన్, ఫ్యూచర్ సిటీ డీసీపీ శ్రీమతి సిరిషా రాఘవేంద్ర హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ర్యాగింగ్ వల్ల కలిగే తీవ్ర పరిణామాలు, ర్యాగింగ్‌కు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, విద్యార్థుల బాధ్యతలు, ర్యాగింగ్ ఘటనలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు మాట్లాడుతూ, విద్యార్థులకు సురక్షితమైన, క్రమశిక్షణతో కూడిన, ర్యాగింగ్ రహిత విద్యా వాతావరణాన్ని అందించేందుకు సంస్థ కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులు పరస్పరం గౌరవం, మర్యాద, స్నేహభావంతో మెలగాలని సూచించారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వక పరిచయానికి, ఇతరులను శారీరకంగా లేదా మానసికంగా ఇబ్బందులకు గురిచేసే ర్యాగింగ్‌కు మధ్య ఉన్న తేడాను ప్రతి విద్యార్థి అర్థం చేసుకోవాలని ప్రొఫెసర్ నరసింహులు సూచించారు. కళాశాలలో అమలులో ఉన్న యాంటీ ర్యాగింగ్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఎవరైనా విద్యార్థి ఇబ్బందులకు గురైతే వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సీబీఐటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. శ్రీధర్ కార్యక్రమానికి కన్వీనర్‌గా వ్యవహరించి సమన్వయం చేశారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, బాధ్యతాయుత పౌరసత్వం వంటి విలువలను పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ర్యాగింగ్ వల్ల కలిగే చట్టపరమైన, సామాజిక, వ్యక్తిగత పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్యాంపస్‌లో స్నేహభావం, పరస్పర గౌరవం, సమానత్వం, బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందించుకోవాలని సూచించారు. చివరగా విద్యార్థులు ర్యాగింగ్‌కు పూర్తిగా వ్యతిరేకంగా నిలిచి, ర్యాగింగ్ రహిత క్యాంపస్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేయడంతో కార్యక్రమం ముగిసింది.

# మహిళల చేతికి రూ.8.29 కోట్ల బలం!

**92 మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు.. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యం: ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**





**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి.. కుటుంబ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గుండాల మండలంలో గురువారం 92 మహిళా సంఘాలకు రూ. 8.29 కోట్ల వడ్డీలేని రుణాలను పంపిణీ చేశారు. రుణాలను కేవలం అవసరాల కోసం కాకుండా వ్యాపారాలు, ఉపాధి మార్గాలకు పెట్టుబడిగా మలుచుకుని ఆర్థికంగా ఎదగాలని మహిళలకు సూచించారు. మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళా సంఘాలకు రుణాలు అందజేశారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

**"పొదుపే పెట్టుబడి.. క్రమశిక్షణే నమ్మకం"**

మహిళా సంఘాల సభ్యులు క్రమశిక్షణతో పొదుపు చేయడం, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం వల్లే బ్యాంకులు పెద్ద మొత్తంలో రుణాలు అందిస్తున్నాయని అయిలయ్య తెలిపారు. ఎవరూ డిఫాల్ట్ కాకుండా రుణాలను సక్రమంగా చెల్లించాలని సూచించారు. రుణాలపై వడ్డీని ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి బ్యాంకులకు చెల్లించేలా చర్యలు చేపడుతోందన్నారు.

**"కోటి మంది మహిళలు.. కోటీశ్వరులు!"**

మహిళలను ఇంటికే పరిమితం చేయకుండా ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అయిలయ్య తెలిపారు. తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వ్యాపారాలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల్లో మహిళా సంఘాలకు అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. గుండాలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువులు, విత్తనాల కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వచ్చే పంట కాలంలో ఐకేపీ కేంద్రాల ద్వారా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**"రేషన్ కార్డు.. పేదోడి ఆత్మగౌరవం"**

రేషన్ కార్డు కేవలం బియ్యం కోసం ఉపయోగించే కార్డు కాదని.. పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. ఈ వారంలో గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శుల ద్వారా కార్డులను ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్నప్పటికీ కార్డు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని చెప్పారు. దసరా నుంచి అర్హులైన వారికి కొత్త పింఛన్లు అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**"దళారులకు చెక్.. ఒక్క రూపాయి ఇవ్వొద్దు!"**

ప్రభుత్వ పథకాల కోసం దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని అయిలయ్య స్పష్టం చేశారు. రుణాలు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ఎవరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు నేరుగా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళలు తనను ఎమ్మెల్యేగా కాకుండా తమ బిడ్డగా, తమ్ముడిగా ఆదరిస్తున్నారని అయిలయ్య అన్నారు. వారి ఆశీర్వాదంతో ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం పాచిల్ల గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్ఎం, బ్రాంచ్ మేనేజర్, ఏపీడీఓ, డీఆర్‌డీఏ అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## ఈనెల 27న యాదగిరిగుట్టలో జరిగే ఆవిర్భవ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి


**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** ఈనెల 27న యాదగిరిగుట్టలో జరిగే ఉద్యమకారుల ఫోరం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, గౌరవాధ్యక్షుడు కళ్లెం లక్ష్మారెడ్డి లు పిలుపునిచ్చారు. గురువారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారుల ఆకాంక్షలకై గత తొమ్మిది సంవత్సరాలుగా డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి ఉద్యమకారుల హక్కులను మేనిఫెస్టోలో పెట్టించిన ఘనత ఉద్యమకారుల పోరందేనని, ఈనెల 27న యాదగిరిగుట్టలో లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రాంగణంలో జరిగే తొమ్మిదవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుండి ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారుడు బొడిగె సుదర్శన్ గౌడ్, చిలుగూరి సత్తిరెడ్డి,కదిరేణి స్వామి, ఐటి పాముల పుష్పమ్మ, కన్నె కంటి శ్రీనివాసచారి, కొండూరు శ్రీరాములు, సత్తయ్య, పల్లెర్ల రామచంద్రం, దండ మల్లికార్జున్, ఉక్కుర్తి స్వామి, పారుపల్లి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న తుమ్మల దంపతులు



అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 23: అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో తుమ్మల సునీత--పాండురంగారెడ్డి దంపతులు గణేష్ మండపం వద్ద బుధవారం ఘనంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తుమ్మల దంపతులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. మహా అన్నదాన కార్యక్రమానికి కాలనీవాసులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు తుమ్మల సునీత--పాండురంగారెడ్డి దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు దంపతులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులు తుమ్మల కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన సింధు ఆదర్శ్ రెడ్డి



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 24:** భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి గురువారం రామచంద్రాపురం డివిజన్‌లోని అవతార్ అపార్ట్‌మెంట్స్, మల్లికార్జున్ నగర్, భారతీనగర్ డివిజన్ ఎల్‌ఐజీ కాలనీల్లో ఏర్పాటు చేసిన వివిధ వినాయక మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాలనీల్లోని పార్కుల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సైతం సందర్శించి భక్తులతో మమేకమయ్యారు. అనంతరం ఎల్‌ఐజీ కాలనీలో మహేష్ ఆధ్వర్యంలో వైష్ణవి యూత్ అసోసియేషన్ నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, ఎల్‌ఐజీ కాలనీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో నీటి నాణ్యత లేబుల్ పడో అవగాహన సదస్సు

**విద్యార్థినీలకు అవగాహన కల్పిస్తున్న నాంది కమ్యూనిటీ వాటర్ సర్వీసెస్**



**క్రైమ్ మిర్రర్, సంస్థాన్ నారాయణపురం:-** నాంది కమ్యూనిటీ వాటర్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపూరశీ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ( బాలికల) లో విద్యార్థినీలకు వాటర్ క్వాలిటీ పైన, లేబుల్ పడో అంశాల పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు వసంత్ కెమికల్స్ వారి సహకారంతో నిత్యం త్రాగునీరు అందజేస్తున్నామని నాంది మార్కెటింగ్ మేనేజర్ సమంత తెలిపారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు నిత్యం మార్కెట్లో కొనుగోలు చేసే ప్యాకేజ్డ్ ఫుడ్ చాక్లెట్స్ ,బిస్కెట్స్, కూల్ డ్రింక్స్, చిప్స్ ప్యాకెట్ల పైన ఉండే ఇంగ్రిడియంట్స్ వాటి విలువలను అర్థం చేసుకొని ఆరోగ్యానికి హాని కలిగించే వాటిని గుర్తించి కొనుగోలు చేసుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా నిత్యం త్రాగే త్రాగునీటి నాణ్యత పైన టీడీఎస్ ఎక్కువగా ఉండటం ఒక్కటే నీరు "కంటామినేటెడ్" అని అర్థం కాదు. నీటి భద్రతను అంచనా వేయడానికి మైక్రోబయాలజికల్ పరీక్షలు అవసరమైన రసాయన పరీక్షలు కూడా చేయాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘుమారెడ్డి , వసంత కెమికల్స్ అధికారుల శ్రీహరి,రాజు నాంది కమ్యూనిటీ వాటర్ సర్వీసెస్ అధికారుల ప్రియాంక, సోనాలి, వెంకటస్వామి, నాగరాజు, గిరిబాబు, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.



## ఆనంద్ బాగ్ వెంకన్న స్వామి హుండీ ఆదాయం లెక్కింపు

**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** మల్కాజ్ గిరి ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో స్వామి వారికి భక్తులు హుండీలోసమర్పించిన కానుకలను గురువారం ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి అసిస్టెంట్ కమిషనర్ ఎ చంద్ర శేఖర్ సమక్షం లో లెక్కించారు. డెబ్బై రోజులు లకు 4,73,575( నాలుగు లక్షల డేబ్బైమూడు వేల ఐదువందల దెబ్బైఐదు రూపాయలు ) ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ బి రవీంద్ర రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ బి రవీంద్ర రెడ్డి ,ప్రధానార్చకులు ముడుంబై వెంకట రమణా చార్యులు, అర్చకులు డా తులసి వెంకట రమణా చార్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్ మాజీ చైర్మన్లు ఉమేష్ సింగ్ రాందాస్ సంతోష్ రాజ్ ముదిరాజు అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు సానాధి శంకర్ , హేమంత్ కుమార్, గణేష్ (కన్నా), సురేష్ సింగ్ , రవీందర్, మల్కాజ్ గిరి హెచ్ జీ యాదయ్య, భక్తులు రత్నమాల, రత్నమాణిక్యం, కె వి ఎస్ ప్రసాద్ , సూర్యకుమారి,ప్రభాకర్, ఎలియమ్మ,అరుణ,పద్మావతి,మీనాక్షి,వరలక్ష్మి,రాధమ్మ, గిరిధర్ రావ్, ప్రభావతి, శ్రీలక్ష్మి, రత్నా ,సావిత్రి,గంగా, వి మీనాక్షి, శివాని,ధనలక్ష్మి, సుబ్బారావ్, మధుసూదన్ రావ్, తోట మంజుల, ప్రతిభ, తదితర భక్తులు పాల్గొన్నారు.

## చిమిర్యాలలో ఘనంగా గణనాథుని నిమజ్జనం

**రూ.1.51 లక్షలకు లడ్డూ దక్కించుకున్న ధోనురు సంజీవరెడ్డి--పూలమ్మ దంపతులు**



**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం చిమిర్యాల గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలంలో గ్రామానికి చెందిన దోనూరు సంజీవరెడ్డి--పూలమ్మ దంపతులు రూ. 1,51,000లకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. వేలం కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు సుర్వి కిరణ్, ఆరుట్ల రాజు, కేసని రమేష్, సుర్వి నరేష్, ఆరుట్ల కిరణ్, మండల్లోజు శ్రీకృష్ణాచారి, పెంబళ్ల వెంకటేష్, మరి సాయి, మల్లేపల్లి సతీష్‌రెడ్డి, మేకల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్యుల నిర్లక్ష్యంతో వారం వ్యవధిలోనే రెండు ఆవులు మృతి

**లక్షకు పైగా నష్టంతో రోడ్డున పడ్డ రైతు!**



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని వెంకం భావి తండాలో పశువైద్యుల తీవ్ర నిర్లక్ష్యం వెలుగు చూసింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సమయానికి వైద్యులు అందుబాటులో లేకపోవడంతో, తండాకు చెందిన రైతు కరంటోత్ బాలు తన జీవనాధారమైన రెండు పాడి ఆవులను వారం వ్యవధిలోనే కోల్పోవాల్సి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన పెంచుకుంటున్న ఆవుకు తీవ్రమైన జలుబుతో పాటు దొమ్మరోగం సంభవించడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ పశు వైద్య ఆసుపత్రికి పలుమార్లు వెళ్లాడు. అయితే ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో సమయానికి సరైన వైద్యం అందక ఆవు ఆరోగ్యం క్షీణించి చివరకు మృతి చెందింది. సరిగ్గా వారం రోజుల క్రితం కూడా ఇలాగే సరైన వైద్యం అందక మరో ఆవు చనిపోయిందని, వారం వ్యవధిలోనే రెండు ఆవులు చనిపోవడంతో దాదాపు లక్ష రూపాయలకు పైగా తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతు బాలు ఆవేదన వ్యక్తం చేశాడు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పశు వైద్యులపై ఉన్నతాధికారులు తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డ రైతును ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# కాంగ్రెస్ రాకతో మళ్లీ కరెంట్ కష్టాలు: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

## సింగరేణి జైపూర్ పవర్ ప్లాంట్‌ను సందర్శించిన బిఆర్ఎస్ నేతలు

## కరెంట్ లేక ఎండిపోతున్న పంటలు.. ఇబ్బందుల్లో రైతులు

## పూర్తిస్థాయిలో కరెంట్ ఉత్పత్తి చేయాలని డిమాండ్



**మంచిర్యాల సెప్టెంబర్ 24 (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో రేవంత్ రెడ్డినాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీవ్రస్థాయిలో కరెంట్ కోతలు పెరిగిపోయాయని, దీనివల్ల రాష్ట్ర ప్రజలు, రైతులు పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బిఆర్ఎస్ నాయకుల బృందం గురువారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించింది. ప్లాంట్ లో విద్యుత్ ఉత్పత్తి బొగ్గు నిల్వలు, యూనిట్ల పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ వ్యాప్తంగా విద్యుత్ రంగంలో జరుగుతున్న పరిణామాలపై నిజనిజాలు తేల్చడానికి కేటీఆర్ పిలుపు మేరకు భూపాలపల్లి, మణుగూరు, పాల్వంచ, దామరచర్ల, జైపూర్ పవర్ ప్లాంట్లతో పాటు హైదరాబాద్‌లోని సింగరేణి హెడ్ ఆఫీస్‌ను సందర్శించడానికి బిఆర్ఎస్ బృందాలను పంపించినట్లు తెలిపారు.

**రైతులకు తీరని అన్యాయం -- ఎండిపోతున్న పంటలు**

గత కొన్ని రోజులుగా విపరీతమైన కరెంట్ కోతల వల్ల పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని బాల్క సుమన్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు కనీసం 4 గంటల ఉచిత కరెంట్ కూడా సరిగ్గా అందించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇళ్లలో వాడే కరెంట్‌ను కూడా రోజుకు 20 సార్లకు పైగా తీసేస్తున్నారని, కనీసం 9 నుంచి 10 గంటలు కూడా సరిగ్గా ఇవ్వడం లేదని ఆరోపించారు. చివరికి ఐటీ హబ్ అయిన పశ్చిమ హైదరాబాద్‌లోని ప్రధాన కంపెనీలు సైతం 30 నుండి 40 శాతం విద్యుత్ కోసం జనరేటర్లపై ఆధారపడే దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో 24 గంటలు ఉన్న ఉచిత, నాణ్యమైన కరెంట్, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మాయమైందని విమర్శించారు.

**జెన్‌కో బకాయిల వల్ల తగ్గిన విద్యుత్ ఉత్పత్తి**

జెన్‌కో సంస్థ సింగరేణికి రూ. 52,000 కోట్లు బకాయి పడటం వల్ల బొగ్గు సరఫరాలో తీవ్ర సమస్య ఏర్పడిందని, అది విద్యుత్ ఉత్పత్తిపై నేరుగా ప్రభావం చూపిందని ఆయన చెప్పారు. తెలంగాణలో కరెంట్ ఉత్పత్తికి సరిపడా బొగ్గును సరఫరా చేయకుండా ఉద్దేశపూర్వకంగా విద్యుత్ ఉత్పత్తిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. జైపూర్ సింగరేణి పవర్ ప్లాంట్‌లో 600 మెగావాట్ల సామర్థ్యం ఉన్న రెండు యూనిట్లు ఉండగా, ప్రస్తుతం ఒక యూనిట్ పూర్తిగా మూతపడిందని వెల్లడించారు. రెండో యూనిట్‌లో కూడా కేవలం 330 మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. బొగ్గు నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ కరెంట్ ఎందుకు తయారు చేయడం లేదని ప్లాంట్ అధికారులను ప్రశ్నిస్తే, "పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకే తక్కువ ఉత్పత్తి చేస్తున్నాం" అని చెప్పారని పేర్కొన్నారు.

**విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం**

గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో జైపూర్ పవర్ ప్లాంట్ 90.16 శాతం పి.ఎల్.ఎఫ్ తో 1200 మెగావాట్లకు గాను 1000 మెగావాట్లకు పైగా కరెంట్ ఉత్పత్తి చేసేదని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో రాష్ట్ర విద్యుత్ సామర్థ్యం 7,778 మెగావాట్లు మాత్రమే ఉంటే, కేసీఆర్ హయాంలో దాన్ని 19,464 మెగావాట్లకు పెంచామని వివరించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం యాదాద్రి, భద్రాద్రి, కాకతీయ మరియు జైపూర్ పవర్ ప్లాంట్లను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, నీళ్లు, కరెంట్, యూరియా, విత్తనాలు సరిగా అందించకపోగా పండించిన పంటలను కూడా కొనడం లేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా జూరాల ప్రాజెక్ట్ వద్ద రైతులు గేట్లు పగలగొట్టుకుని నీళ్లు మళ్లించుకోవాల్సిన దుస్థితి వచ్చిందని అన్నారు.

**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ వస్తే కరెంట్ ఉండదని నాడు వ్యాఖ్యానించారని, కేసీఆర్ ఆ సమస్యను అధిగమించి నాణ్యమైన కరెంట్ ఇచ్చారని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి మళ్లీ నాటి చీకటి రోజులను తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. రైతులకు అన్యాయం చేస్తే ఏ ప్రభుత్వం నిలబడదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల శాపం తగులుతుందని హెచ్చరించారు. జైపూర్ పవర్ ప్లాంట్‌లో గతంలోలాగే 1200 మెగావాట్లకు పైగా ఉత్పత్తిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉమ్మడి ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల ప్రజలు, రైతులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, నాయకులు జాన్సన్ నాయక్, రాజారెడ్డి, కౌశిక్, మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, రాజిరెడ్డి పాల్గొన్నారు.



## కేపీఆర్ కాలనీలో రూ.6.15 లక్షలకు గణేష్ లడ్డూ వేలం

### వేలంలో లడ్డూను దక్కించుకున్న గుంటూరు మల్లికార్జున్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ మణికొండలోని కేపీఆర్ కాలనీలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో లడ్డూ వేలం పాట ఉత్సాహంగా జరిగింది. ఈ వేలం పాటలో గణేష్ లడ్డూ రూ.6,15,116లకు అమ్ముడైంది. కేపీఆర్ కాలనీకి చెందిన గుంటూరు మల్లికార్జున్ వేలం పాటలో లడ్డూను దక్కించుకున్నారు. వేలం కార్యక్రమంలో కాలనీ వాసులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొని ఉత్సాహంగా వేలం పాట నిర్వహించారు. లడ్డూను దక్కించుకున్న గుంటూరు మల్లికార్జున్‌ను కాలనీ అధ్యక్షుడు ఈ. గంగాధర్ రావుతో పాటు అసోసియేషన్ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఈ. గంగాధర్ రావు మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు కాలనీ వాసులంతా ఐక్యంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఉత్సవాల నిర్వహణతో పాటు సామాజిక కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సింహ రాజి రెడ్డి, ట్రెజరర్ వేణు, రమణారెడ్డి, గణేష్, రత్నం, భాస్కర్, గిరి, శ్రీప్రియ, సునీత, హరీష్, శ్రీకాంత్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. 23-09-2026న రాత్రి సుమారు 12 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీకొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో ఆయనను గుర్తించేందుకు రాజేంద్రనగర్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లయితే లేదా ఆయనకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే వెంటనే రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు అందించే సమాచారం ద్వారా గాయపడిన వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు అవకాశం ఉంటుందని పోలీసులు తెలిపారు.

## కాటేదన్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాటేదన్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ప్రతిష్ఠించిన శ్రీ వినాయక విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మైలార్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సనాయీ వాయిద్యాల నడుమ వినాయక విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. తదుపరి బీజేపీ కార్యాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి కొలనులో పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి తోకల శ్రీనివాస్ రెడ్డి వినాయక విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సనాయీ వాయిద్యాల నడుమ నిర్వహించిన ఊరేగింపుతో కాటేదన్‌లో పండుగ వాతావరణం నెలకొంది. గణపతి బప్పా మోరియా.. మంగళమూర్తి మోరియా అంటూ భక్తులు నినాదాలు చేస్తూ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో విజయవంతంగా ముగిసింది.



## లక్ష్మీగూడ ఆర్జీకే ఫేజ్-2లో రూ.1.30 లక్షలకు లడ్డూ వేలం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ ఆర్జీకే ఫేజ్-2లో బజరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలం పాటలు ఉత్సాహంగా జరిగాయి. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వేలం కార్యక్రమం సందడిగా సాగింది. వేలం పాటలో రెండు లడ్డూలకు భక్తులు పోటీపడ్డారు. ఇందులో సాయి అన్నల శ్రీనివాస్ రూ. 1,30,000లకు ఒక లడ్డూను దక్కించుకున్నారు. మరో లడ్డూను గంగారం శంకర్ రూ. 53,001లకు కైవసం చేసుకున్నారు. లడ్డూ వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని గణనాథుని ప్రసాదాన్ని దక్కించుకునేందుకు పోటీపడ్డారు. వేలం అనంతరం లడ్డూలను దక్కించుకున్న విజేతలకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు. బజరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలతో పాటు లడ్డూ వేలం నిర్వహించారు. దీంతో లక్ష్మీగూడ ఆర్జీకే ఫేజ్-2లో పండుగ సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో పి. అంజమ్మ బజరంగ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు....

## పుప్పాలగూడలో రూ.3.55 లక్షలకు గణేష్ లడ్డూ వేలం

### లడ్డూను దక్కించుకున్న కస్తూరి యాదయ్య





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ మణికొండ పరిధిలోని పుప్పాలగూడ గ్రామంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో లడ్డూ వేలం పాట ఉత్సాహంగా జరిగింది. గణేష్ మహారాజ్ లడ్డూను రూ. 3,55,000లకు వేలం వేయగా, కస్తూరి యాదయ్య వేలం పాటలో లడ్డూను దక్కించుకున్నారు. గణేష్ ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ వేలం కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్, భక్తులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని గణేష్ ఉత్సవాల నిర్వహణతో పాటు ఇతర సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లడ్డూను దక్కించుకున్న కస్తూరి యాదయ్యను గణేష్ ఉత్సవ నిర్వాహకులు, గ్రామస్థులు అభినందించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గణేష్ ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో పుప్పాలగూడలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

## రాజేంద్రనగర్‌లో దారుణ హత్య

### ఉప్పర్‌పల్లి హ్యాపీ హోమ్స్‌లో యువకుడిపై కత్తులతో దాడి

గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య చోటుచేసుకుంది. ఉప్పర్‌పల్లిలోని హ్యాపీ హోమ్స్‌లో నివాసముంటున్న వసీం అనే యువకుడు హత్యకు గురయ్యాడు. అతని స్నేహితులే కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. పోలీసుల ప్రాథమిక వివరాల ప్రకారం.. వసీంతో పాటు నిందితులపై గతంలో ఎన్‌డీపీఎస్ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. డ్రగ్స్ విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని బయటకు లీక్ చేస్తున్నాడన్న అనుమానంతో వసీంపై అతని స్నేహితులు కొంతకాలంగా కక్ష పెంచుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో స్నేహితుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, ఇద్దరు వ్యక్తులు కలిసి వసీంపై కత్తులతో దాడి చేసినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన వసీం మృతి చెందినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని హత్యకు దారితీసిన కారణాలు, నిందితుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు



# కన్నుల పండుగగా వినాయకుడి శోభయాత్ర

అడుగడుగునా ప్రత్యేక పూజలు,హారతులు

భక్తిశ్రద్ధలతో సాగిన లంబోదరుడి శోభయాత్ర

భక్తినామ నామస్మరణతో మారు మోగిన పురవీధులు.

లక్ష 75 వేలు పలికిన లడ్డు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 24 (క్రైమ్ మిర్రర్):** వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భాగ్యనగర్ కాలనీ అడ్డగుట్ట మూడవ రోడ్డులో గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు నిమజ్జనానికి తరలిన శోభయాత్ర స్థానికులను ఆకట్టుకుంది. సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శోభ యాత్రతో అడ్డగుట్ట లోని పలు వీధులు భక్తి నామస్మరణతో పులకించిపోయాయి. శోభ యాత్ర ప్రారంభానికి ముందు అసోసియేషన్ సభ్యులు వినాయకుని వద్ద నవరాత్రులు పూజలు అందుకున్న లడ్డుకు వేలంపాట నిర్వహించారు. ఆద్యాంతం ఆసక్తికరంగా సాగిన ఈ వేలంపాటలో గుండపనేని వెంకటేశ్వరరావు లక్ష 75 వేల రూపాయలకు వినాయకుడి లడ్డును సొంతం చేసుకున్నాడు.



అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభ యాత్రను ప్రారంభించారు. నిమజ్జనానికి తరలి వెళ్తున్న వినాయకుడికి అడుగడుగున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడ్డగుట్ట కాలనీ నుండి ప్రారంభమైన శోభాయాత్ర మహిళలను, యువకులను, భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా శోబయాత్రలో యువకులు ఉత్సాహంగా చేసిన నృత్యాలు పలువురిని ఆలరించాయి. విద్యుత్ దీపకాంతులతో అందంగా అలంకరించిన శోభయాత్రను అసోసియేషన్ సభ్యులు భక్తిశ్రద్ధలతో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తూ



భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. తొమ్మిది రోజులు విశేష పూజలు అందుకున్న వినాయకుడిని గంగమ్మ ఒడికి సాగనంపారు. ఈ వినాయక నిమజ్జన శోభాయాత్రలో స్థానిక భక్తులు,యువకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## నార్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: - సీఐటీయూ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ గండిపేట మండల కమిటీ డిమాండ్ చేసింది. జీహెచ్ఎంసీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, కార్యదర్శి ఎస్. జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరు వార్డులకు కేవలం 24 మంది కార్మికులు మాత్రమే పనిచేస్తున్నారని, దీంతో పనిభారం పెరిగిందని సీఐటీయూ నాయకులు తెలిపారు. సిబ్బంది కొరత, పనిఒత్తిడి, పే-స్లిప్‌లు, పీఎఫ్ వివరాలు అందకపోవడం, ఆరోగ్య పరీక్షలు సక్రమంగా నిర్వహించకపోవడం, భద్రతా పరికరాలు అందకపోవడం వంటి సమస్యలను కార్మికులు తమ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, దీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. కార్మికులకు ప్రతి నెలా పే-స్లిప్, పీఎఫ్ వివరాలు అందించడంతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సేఫ్టీ కిట్లు, చెప్పులు అందించాలని కోరింది. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పుల్లారావు, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.4.11 లక్షలకు మున్నూరు కాపు వినాయకుడి లడ్డూ వేలం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ నార్మ్కాడలోని మున్నూరు కాపు వినాయక మండపంలో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న వినాయక స్వామివారి పవిత్ర లడ్డూ వేలం ఉత్సాహంగా జరిగింది. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వేలం కార్యక్రమం సందడిగా సాగింది. వేలం పాటలో నార్మ్కాడకు చెందిన మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సీహెచ్‌బీ సాయి కృష్ణ (భాషయ్య కుమారుడు) రూ.4,11,000లకు గణనాథుని లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూను దక్కించుకున్న సాయి కృష్ణకు మున్నూరు కాపు వినాయక మండపం సంఘం తరపున నిర్వాహకులు హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. శ్రీ విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులతో సాయి కృష్ణతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం, శ్రేయస్సు కలగాలని ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల పాటు మండపంలో ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. లడ్డూ వేలంతో నార్మ్కాడలో పండుగ సందడి నెలకొంది.

## బాలానగర్ పరిధిలో బీహార్ ప్లంబర్ మిస్సింగ్



**బాలానగర్, సెప్టెంబర్ 24 (క్రైమ్ మిర్రర్) :** పని కోసం బీహార్ రాష్ట్రం నుండి నగరానికి వచ్చిన ఓ ప్లంబర్ అనుమానాస్పద రీతిలో అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. బాలానగర్ సీఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌లోని తేటేట్ జిల్లాకు చెందిన ముఖేష్ సింగ్ (39) తన ముగ్గురు మిత్రులతో కలిసి ఉపాధి నిమిత్తం ఈ నెల సెప్టెంబర్ 2న హైదరాబాద్ వచ్చారు. బాలానగర్ డీమార్ట్ సమీపంలో ఉన్న 'ఏ2ఏ' కంపెనీలో వీరు పనికి కుదిరారు. రెండు రోజుల పాటు కంపెనీలోనే పనిచేసిన అనంతరం, ముఖేష్ మిత్రులు పని నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లగా, ముఖేష్ మాత్రం అక్కడే ఉన్నాడు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో పని ముగించుకుని కంపెనీ సూపర్‌వైజర్ శివ, మరికొందరు సిబ్బందితో కలిసి ముఖేష్ బాలానగర్ ప్రధాన రహదారి వరకు కలిసి వచ్చాడు. ఆ తర్వాత నుంచి ముఖేష్ సింగ్ ఆచూకీ లభించకపోవడంతో పాటు ఆయన మొబైల్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అయింది. ఎంత వెతికినా సమాచారం లేకపోవడంతో ఆందోళన చెందిన ముఖేష్ కుటుంబ సభ్యులు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని, సిసిటివి ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. చిత్రంలో ఉన్న వ్యక్తి లేదా ముఖేష్ సింగ్‌కు సంబంధించిన ఎలాంటి ఆచూకీ తెలిసినా వెంటనే తమకు 9490617114 / 8019133291 సమాచారం అందించాలని బాలానగర్ సీఐ ప్రశాంత్ ప్రజలను కోరారు.

## గణేష్ ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన పట్వారీ శశిధర్



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 24 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని "పిజేఆర్ నగర్" బ్లాక్ 72 నివాసులు, "రాజీవ్ గాంధీ నగర్" లోని శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, కాలనీవాసుల ఆహ్వానంమేరకు "ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు" పట్వారీ శశిధర్ గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక డివిజన్ సీనియర్ నాయకులు, కాలనీ పెద్దలు, భక్తులతో కలిసి గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, ఆశీర్వాదాలు పొందారు. అనంతరం వినాయకుడిని, కలశాన్ని భక్తుల సమక్షంలో కదిలించి నిమజ్జన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని పట్వారి శశిధర్ ఆకాంక్షించారు. కమిటీ సభ్యులు నిర్వహించిన "అన్నదాన" కార్యక్రమంలో పాల్గొన్న పట్వారీ శశిధర్ భక్తులకు, స్థానిక ప్రజలకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, కాలనీవాసులు, భక్తులు, టీం పట్వారీ తదితరులు పాల్గొన్నారు.



## రూ.1,75,000 లకు లడ్డుని గెలుచుకున్న కాకతీయ స్కూల్ డైరెక్టర్ తిరుపతి రావు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 24 (క్రైమ్ మిర్రర్):** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని పాపారాయుడు నగర్‌లోని కాకతీయ స్కూల్ డైరెక్టర్ పెంద్యాల తిరుపతి రావు వినాయక చవితి ఉత్సవాల్లో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పాల్గొని రూ.1,75,000/-లకు లడ్డును దక్కించుకున్నారు. భక్తిశ్రద్ధల మధ్య జరిగిన ఈ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లడ్డును దక్కించుకున్న పెంద్యాల తిరుపతి రావు కి నిర్వాహకులు, భక్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి రావు మాట్లాడుతూ, వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## గణేష్ నవరాత్రుల పూజ కార్యక్రమంలో జిల్లా గణేష్



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 24 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో వినాయక నవరాత్రుల సందర్భంగా గణేష్ మండప నిర్వాహకుల ఆహ్వానం మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ తులసి నగర్, ఎన్టీఆర్ నగర్, పీజేఆర్ నగర్, నవోదయ కాలనీ, పాపమ్మ బస్తి, దత్తాత్రేయ కాలనీ, శంశిగుడ తదితర వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండప నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ నవరాత్రులు స్వేచ్ఛవాతవరణం లో ఎలాంటి ఆటంకాలు లేకుండా భక్తిశ్రద్ధలతో దిగ్విజయంగా పూజలు జరుపుకోవడం శుభపరిణామం అని, అలాగే నిమర్జన కార్యక్రమంలో కూడా ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా మండప కమిటీ సభ్యులు చొరవ తీసుకొని వినాయక ఊరేగింపు కొనసాగించాలని అన్నారు. ఈకార్యక్రమంలో మండపం కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు

## జాతీయ వేదికపై ప్రగతినగర్ 'ఐరిస్ ఫ్లోరెట్స్'

కరస్పాండెంట్ జ్యోత్స్న శరత్ రెడ్డి హర్షం






**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 24 (క్రైమ్ మిర్రర్):** దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా నిర్వహించిన జాతీయ స్థాయి విద్యా పురస్కారాలలో నిజాంపేట్ సర్కిల్, ప్రగతినగర్ ఎన్క్లైవ్ కాలనీ లోని 'ఐరిస్ ఫ్లోరెట్స్ -- ది హ్యాపీ ప్లే స్కూల్' విశేష ప్రతిభ కనబరిచి సత్తా చాటింది. ద్వారకలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో సెప్టెంబర్ 22, 23 తేదీలలో నిర్వహించిన "సిఫోర్ స్కూల్ ర్యాంకింగ్స్ / ఈడియు ఎక్స్‌పో గ్లోబల్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డ్స్--2026" సదస్సులో పాఠశాలకు రెండు ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాలను అందజేశారు. పాఠశాలలో చిన్నారుల సమగ్ర రక్షణ, ఆరోగ్యం మరియు వెల్-బీయింగ్‌కు అత్యున్నత ప్రాధాన్యతనిచ్చినందుకు గాను 'ఎక్సలెన్స్ ఇన్ సేఫ్టీ, హెల్త్ & వెల్-బీయింగ్' పురస్కారం లభించింది. అదేవిధంగా విద్యార్థుల సహజ ఆసక్తులు, అవసరాలకు అనుగుణంగా వినూత్న అభ్యాస విధానాలను అమలు చేస్తున్నందుకు 'ఎక్సలెన్స్ ఇన్ చైల్డ్-సెంట్రిక్ లెర్నింగ్' అవార్డు దక్కింది. ఈ రెండు పురస్కారాలతో జాతీయ స్థాయిలో పాఠశాల అగ్రగామిగా నిలిచింది. జాతీయ పురస్కారాలు దక్కడంపై కరస్పాండెంట్ జ్యోత్స్న శరత్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ.. సురక్షితమైన, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని అందించే తమ నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరించిన ఉపాధ్యాయ, బోధనేతర బృందానికి, పాఠశాలపై నమ్మకముంచిన తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ తుర్లపాటి శిరీష్, స్థానిక కాలనీ ప్రతినిధులు, విద్యావేత్తలు పాఠశాల బృందాన్ని మనస్ఫూర్తిగా అభినందించారు.

## మార్కండేయ నగర్ గణేష్ మండపంలో ముగిసిన నవరాత్రి పూజలు



**గండిపేట్(క్రైమ్ మిర్రర్):** కాటేదాన్ డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్ గణేష్ మండపంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా ఆఖరి రోజు పూజా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విఘ్నేశ్వర భగవానునికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని వేడుకున్నారు. పూజా అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజలో పాల్గొన్నవారు గద్దె కృష్ణ, పగిడిమర్రి సూర్యనారాయణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విడెం రమేష్, ప్రధాన కార్యదర్శి, కోట శ్యామ్



కుమార్, నవోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కోట పవన్ కుమార్,కంచె నర్సింహా,గంజి యాదగిరి,అవ్వారి పరమేష్,క్యాంకొండ శంకర్, శంకర్ రావు, అర్చకులు మహేష్, విడెం సాయికిరణ్, అవ్వారి శివ, మహిళా మణులు, గద్దె పద్మ, పగిడిమర్రి ఉమాదేవి, గంజి ధనలక్ష్మి, క్యాం కొండ లలిత,అవ్వారి సావిత్రి,మంగలి చంద్రమ్మ, గద్దె లలిత, బి. సరిత, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు......

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో "చలో దామరచర్ల యాదాద్రి ప్లాంట్"

**విద్యుత్ కోతలపై యాదాద్రి ప్లాంట్ కు తరలి వెళ్లిన బిఆర్ఎస్ నాయకులు**

**రైతులకు కరెంట్ కష్టాలు తీర్చకపోతే సీఎం రాజీనామా చేయాలి**

**బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు**



**క్రైమ్ మిర్రర్, హుజూర్ నగర్ :** రైతులకు కరెంట్ కష్టాలు తీర్చకపోతే సీఎం రాజీనామా చేయాలనీ బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు అన్నారు.

బిఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సూచన మేరకు హుజుర్నగర్ బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు ఆధ్వర్యంలో హుజుర్నగర్ నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ నాయకులు, శ్రేణులు గురువారం చలో దామరచర్ల యాదాద్రి పవర్ ప్లాంట్ నిరసన కార్యక్రమం నకు భారీగా తరలివెళ్లారు.ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు మాట్లాడుతూ రైతు కోసం.. పెరుగుతున్న విద్యుత్ సంక్షోభం మరియు తగ్గిన విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు కోసం .. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సూచన మేరకు దామరచర్లలో నిర్వహించే కార్యక్రమం నకు తరలివెళ్లడం జరిగిందని, రైతులకు సక్రమంగా కరెంటు ఇవ్వడం చేతకాక పోతే సీఎం దిగి పోవాలని,ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం ఒక్క రోజు కూడా కొనసాగే అర్హత లేదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జగన్ నాయక్, పీఏసిఎస్ మాజీ చైర్మన్ వీరం రెడ్డి శంబి రెడ్డి,నియోజకవర్గ పార్టీ సీనియర్ ఉద్యమ నాయకులు న్యాయవాది నగేష్ రాథోడ్, గరిడేపల్లి మాజీ మండలాధ్యక్షుడు కృష్ణ నాయక్, సీనియర్ ఉద్యమ నాయకులు కొణతం లచ్చిరెడ్డి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు లావుడియా శ్రీను నాయక్,హుజూర్నగర్ టౌన్ నాయకులు ముల్కపల్లి రాంబాబు, నేరేడుచర్ల మాజీ మండల అధ్యక్షుడు పంగ శ్రీను, జంపాల వెంకన్న, సర్పంచ్ మచ్చ మురళి,గుగులోత్ హేమ్లా నాయక్,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డీఎస్పీ భీమ్‌రెడ్డి అక్రమాస్తుల కేసులో ఏసీబీ సోదాలు

**హైదరాబాద్, జహీరాబాద్‌లో 10 ప్రాంతాల్లో తనిఖీలు.. రూ.1.35 కోట్ల నగదు స్వాధీనం**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డిపై నమోదైన అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. కేసులో భాగంగా హైదరాబాద్, జహీరాబాద్ పరిధిలోని 10 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. తెలంగాణ డీజీపీ కార్యాలయంలోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సంకిరెడ్డి భీమ్‌రెడ్డిపై ఏసీబీ ఇప్పటికే అక్రమాస్తుల కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా ఆయనతో ఆర్థిక, ఇతర లావాదేవీలు ఉన్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులను అధికారులు గుర్తించి, వారి నివాసాల్లో తనిఖీలు చేపట్టారు.

**బినామీ ఆస్తులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం...**

అనుమానిత బినామీల ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో ఆస్తులకు సంబంధించిన పలు కీలక పత్రాలు, ఇతర ఆధారాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆస్తుల వివరాలు, ఆర్థిక లావాదేవీలు, సంబంధిత వ్యక్తులతో ఉన్న వ్యవహారాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. సోదాల్లో భాగంగా బొమ్మ వెంకటేష్ నివాసంలో రూ.1.35 కోట్ల నగదు గుర్తించినట్లు ఏసీబీ తన ప్రెస్‌నోట్‌లో వెల్లడించింది. అలాగే విదేశీ కరెన్సీతో పాటు సుమారు 14 లీటర్ల విదేశీ మద్యం కూడా లభించినట్లు తెలిపింది. విదేశీ మద్యం లభించిన విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు ఏసీబీ పేర్కొంది. నిబంధనల ప్రకారం ఎక్సైజ్ అధికారులు తదుపరి కేసు నమోదు చేసే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం భీమ్‌రెడ్డి అక్రమాస్తుల కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. సోదాల్లో లభించిన పత్రాలు, నగదు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.



# రావిర్యాలలో కన్నుల పండుగగా వినాయక నిమజ్జనం...!

**జై బోలో గణేష్ మహారాజ్ అంటూ వెల్లివిరిసిన భక్తి, ఐకమత్యం**

**శోభాయాత్రలో పాల్గొన్న యువజన సంఘాలు, భజన మండళ్లు, గ్రామ ప్రజలు**

**మంగళ హారతులతో గంగమ్మ వడిలోకి చేరవేసిన ఆడపడుచులు..**



**మహేశ్వరం ప్రతినిధి క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామంలో వినాయక నిమజ్జనం కన్నుల పండుగగా సాగింది. గ్రామంలో ప్రతిష్టించిన 40కి పైగా వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్రలో యువజన సంఘాలు, భజన మండళ్లు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**వినాయక నిమజ్జనం ఎందుకు చేస్తారు?**

వినాయకుడిని భక్తితో ఇంటికి, మండపానికి తీసుకువచ్చి 9 రోజుల పాటు పూజించి, చివరి రోజున నీటిలో నిమజ్జనం చేయడం వెనుక లోతైన ఆధ్యాత్మిక అర్థం ఉంది. మట్టితో చేసిన గణపతి విగ్రహం పంచభూతాలలో ఒకటైన భూమికి ప్రతీక. విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా మళ్లీ ప్రకృతిలో కలిసిపోవడం, మనిషి జీవితం కూడా ప్రకృతి నుండి వచ్చి తిరిగి ప్రకృతిలోనే కలిసిపోతుందనే సత్యాన్ని తెలియజేయడం దీని ఉద్దేశం. అలాగే బాధలను, అహంకారాన్ని నీటిలో వదిలేసి, విఘ్నాలను తొలగించమని కోరుతూ గణపతిని సాగనంపడం ఆనవాయితీ. శోభాయాత్రలో డీజే సౌండ్స్, కోలాట నృత్యాలు, భజన కీర్తనలతో యువత హోరెత్తించింది. "జై బోలో గణేష్ మహారాజ్ కీ జై" నినాదాలతో గ్రామం మార్మోగింది. అనంతరం రావిర్యాల పెద్ద చెరువులో క్రేన్ సహాయంతో అన్ని విగ్రహాలను సురక్షితంగా నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, గ్రామ పెద్దలు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరిగాయని, అన్ని యువజన సంఘాలు ఐకమత్యంతో కలిసి పనిచేశాయని గ్రామస్థులు తెలిపారు.



# బునియాదిపురంలో గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్

**వనపర్తి సెప్టెంబర్ 24 క్రైమ్ మిర్రర్ :** పెబ్బేరు మండలం బునియాదిపురం గ్రామంలో వితంతు మరియు ఒంటరి మహిళలకు సంబంధించిన పెన్షన్ ఫైనల్ వెరిఫికేషన్ గురువారం నిర్వహించారు. ఈ ప్రక్రియలో అర్హత పొందిన 16 మందికి పెన్షన్ అర్హత ఉన్న లబ్ధిదారులకు. సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్ పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ. ఒంటరి మహిళలకు. వితంతువులకు. ప్రభుత్వం పంపించిన లిస్టులో పరిశీలించి 16 మంది పెన్షన్ అర్హత ఉన్నవారికి లిస్టులో ఫైనల్ చేసి పంపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నా వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రమేష్, భరత్, సహదేవుడు, అలీమా మాబ్, గ్రామస్తులు మరియు పంచాయతీ కార్యదర్శి. తదితరులు పాల్గొన్నారు,

# యువకుడి ప్రాణాలు కాపాడిన అత్తాపూర్ పోలీసులు

**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడిని అత్తాపూర్ పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి కాపాడారు. సమాచారం ప్రకారం మధ్యాహ్నం 1.00 గంటల సమయంలో భాను ప్రకాష్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానని తన స్నేహితుడికి ఫోన్ ద్వారా తెలిపాడు. ఆ సమయంలో తాను అందుబాటులో లేకపోవడంతో సదరు స్నేహితుడు వెంటనే అత్తాపూర్ ఇన్స్పెక్టర్ సీతయ్యకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన ఇన్స్పెక్టర్ తన స్టేషన్ సిబ్బంది అజ్మత్ అలీ, అహ్మద్‌లను అప్రమత్తం చేశారు. లొకేషన్ ఆధారంగా అక్కడికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్య చేసుకుంటున్న భాను ప్రకాష్‌ను సకాలంలో కాపాడి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇన్స్పెక్టర్ సీతయ్య అతనికి కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. సమయానికి స్పందించి ప్రాణాలు కాపాడిన పోలీసులను పలువురు అభినందించారు.




# రికార్డు ధర పలికిన లడ్డు వేలం పాట

**మైస్పేస్-2లో గణనాథుడి లడ్డూను రూ. 15 లక్షల పదివేల కు కైవసం చేసుకున్న సంధ్యా వెంకట రెడ్డి**



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 24 (క్రైమ్ 2) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి మైస్పేస్-2లో ఏర్పాటు చేసిన వినాయక మండపం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నవరాత్రుల సందర్భంగా గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తులకు దర్శనమిచ్చిన గణనాథుడి లడ్డూను నవరాత్రుల ముగింపు సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో రూ.15 లక్షల 10 వేల రూపాయలకు లడ్డూను సంధ్యా వెంకట రెడ్డి కైవసం చేసుకున్నారు. ఎన్నో సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వినాయక మండపంలో అత్యధికంగా లడ్డు ప్రసాదాన్ని కొన్న కుటుంబ సభ్యులను మండప నిర్వాహకులు, కాలనీ పెద్దలు, స్థానికులు, భక్తులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గణేష్ మండపం వద్ద నుండి సన్నాయి వాయిద్యాలతో కాలనీవాసులు అందరు కలిసి ఉత్సాహపరితంగా జై గణేష్ అంటూ నినాదాలు చేస్తూ వారి ఇంటి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# పత్తికుంటలో ఘనంగా 11వ రోజు గణేష్ నిమజ్జనం

**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, భక్తులు**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పత్తికుంటలో 11వ రోజు గణేష్ నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు, ఉత్సవ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై. శ్రీధర్, ఏసీపీ కాలనీ మొగిలి, ఎస్. సురేష్, ట్రైనింగ్ డీఎస్పీ ట్రెయినీ ఎస్. సింధూజ, డివిజన్ కన్వీనర్ గుంజ బాబు రావు, బొమ్మరాజు నర్సింహా, కో-కన్వీనర్ ఇ. వేణుగోపాల్, భాస్కర్ యాదవ్, రఘుమారెడ్డి, రవి, సతీష్, హన్స్‌రాజ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ భక్తులు భక్తిగీతాలు, నినాదాలతో సందడి చేస్తూ గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేలా నిర్వాహకులు, పోలీసు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టారు.

# పత్తికుంట గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**అనంత చతుర్దశి నేపథ్యంలో అధికారుల పర్యటన**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అనంత చతుర్దశి సందర్భంగా రేపు నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి రాజేంద్రనగర్‌లోని పత్తికుంట నిమజ్జన కేంద్రం వద్ద ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. నిమజ్జనానికి భారీ సంఖ్యలో గణేష్ విగ్రహాలు తరలిరానున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ నరేందర్ గౌడ్, రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు, ప్రస్తుతం మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న బొక్క నరసింహ రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై. శ్రీధర్, ఏఈ మూర్తి, కాంట్రాక్టర్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. నిమజ్జన కేంద్రంలో భక్తుల రాకపోకలు, విగ్రహాల నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. నిమజ్జనం కోసం తరలివచ్చిన గణేష్ భక్తులతో అధికారులు, నిర్వాహకులు మాట్లాడి ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. అనంత చతుర్దశి చివరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు నిమజ్జనానికి తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు.

# వృద్ధులను కంటికి రెప్పలా చూసుకోవాలి

**తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జీతంలో 15శాతం కోత తప్పదు**

**జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు**

**వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**క్రైమ్ మిర్రర్, సూర్యాపేట :** సమాజానికి, కుటుంబానికి మార్గదర్శకులైన వయోవృద్ధులను గౌరవించి, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు వారం రోజుల పాటు నిర్వహించే వయోవృద్ధుల వారోత్సవాల గోడ పత్రికను గురువారం కలెక్టరేట్‌లోని వీసీ ఛాంబర్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపకుండా, ఇంట్లోనే ఉంచుకొని ప్రేమగా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు హితవు పలికారు. వృద్ధుల రక్షణ, ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన తెలంగాణ ఎంప్లాయీస్ అకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ చట్టం గురించి వివరించారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోకుండా నిర్లక్ష్యం చేసే పిల్లల స్థూల వేతనం నుంచి నేరుగా 15 శాతం లేదా గరిష్టంగా రూ.10 వేల వరకు కట్ చేసి, తల్లిదండ్రుల ఖాతాకు జమ చేసేలా కఠిన నిబంధనలు ఉన్నాయని స్పష్టం చేశారు. వృద్ధుల హక్కులు, చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో వృద్ధుల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, చట్టప్రకారం న్యాయం చేస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం కేటాయించిన ఉచిత టోల్‌ఫ్రీ నంబర్ 14567 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

**వారం రోజుల పాటు కార్యక్రమాలు**

**సెప్టెంబర్ 24:** వృద్ధుల శ్రేయస్సు, సాధికారత వారోత్సవాల ప్రారంభం, పోస్టర్ల ఆవిష్కరణ.

సెప్టెంబర్ 25: వృద్ధుల ఆరోగ్య,సంరక్షణ దినోత్సవం – – వృద్ధాశ్రమాలలో వినోద కార్యక్రమాలు, ఇండోర్ ఆటలు.

**సెప్టెంబర్ 26:** వృద్ధాశ్రమాల సామర్థ్య పెంపు -- సిబ్బందికి కనీస ప్రమాణాలు, సంరక్షణపై శిక్షణ మరియు తనిఖీలు.

**సెప్టెంబర్ 28:** సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత -- వృద్ధులపై వేధింపులు, మోసాలు, దోపిడీల నివారణపై అవగాహన.

**సెప్టెంబర్ 29:** తరాల మధ్య అనుబంధం -- పాఠశాలల్లో విద్యార్థులు, వారి తాతా-బామ్మలతో కలిసి ఆత్మీయ కలయికలు.

**సెప్టెంబర్ 30:** యాక్టివ్ ఏజింగ్, వెల్‌నెస్ మరియు ఇంటర్-జనరేషనల్ వాకథాన్.

**అక్టోబర్ 01:** జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహణ.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహారావు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యులు సీతారామయ్య, జి.విద్యాసాగర్, ఎస్డీ హమీద్ ఖాన్, ఇరిగే కోటేశ్వరి, గజ్జల కృష్ణారెడ్డి, వినోద్ కుమార్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



# పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**చెంచువాడ ఎంపీపీ పాఠశాలలోవిద్యార్థులకు ఉచిత బూట్ల పంపిణీ**

**మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్**

**వనపర్తి సెప్టెంబర్ 24 క్రైమ్ మిర్రర్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు,గురువారం చెంచువాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత బూట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, ఎంఈఓ జయరాములు, ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలతో పాటు ఉచితంగా బూట్లు అందజేయడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ పెబ్బేరు కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జి. నరసింహ గౌడ్, ఏడో వార్డు కౌన్సిలర్ శివసాయి, పట్టణ అధ్యక్షులు కొంత దయాకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, రణధీర్ రెడ్డి, మాజీ డైరెక్టర్ రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.చిన్న రాములు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పార్వతీ , ఉపాధ్యాయులు రాధ, కృష్ణవేణి,పుష్పవతి, పాల్గొన్నారు.

# హైదరాబాద్ గణేశ్ బందోబస్తు విధుల్లో ఎస్సై దుర్మరణం.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు

**గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఎస్సై వెంకన్న మృతి**

**హైదరాబాద్‌లో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఘటన**

**ప్రమాదం తర్వాత స్వగ్రామానికి వెళ్లగా ఆరోగ్యం క్షీణించి కన్నుమూత**

**కుటుంబానికి అండగా ఉంటామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ హామీ**

**పరారీలో ఉన్న నిందితుడి కోసం సైఫాబాద్ పోలీసుల గాలింపు**



భాగ్యనగర గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) చికిత్స పొందుతూ మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూటౌన్ ఠాణాలో ఎస్సైగా పనిచేస్తున్న కె. వెంకన్న (57) ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన, గణేశ్ నిమజ్జన బందోబస్తు కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చారు. వివరాల్లోకి వెళితే, ఎన్టీఆర్ గార్డెన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సై వెంకన్నకు విధులు కేటాయించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల సమయంలో, సచివాలయం వైపు నుంచి అంబేద్కర్ విగ్రహం వైపు వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు వెంకన్నను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఎస్సై రోడ్డుపై పడిపోగా తల, కుడి మోకాలు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వాహనంతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రమాదం అనంతరం, వెంకన్నను లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాస్త కోలుకున్న తర్వాత ఆయన సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసి, అనంతరం తన స్వగ్రామమైన కిష్టాపురానికి బయలుదేరారు. అయితే, గ్రామానికి చేరుకున్నాక మధ్యాహ్నం తర్వాత ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, తలలో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకన్న కన్నుమూశారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

ఎస్సై వెంకన్న మృతి పట్ల హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. "గణేశ్ నిమజ్జన బందోబస్తులో భాగంగా విధి నిర్వహణలో ఉన్న వెంకన్నగారు గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించడం అత్యంత బాధాకరం, దురదృష్టకరం. ప్రజల భద్రత కోసం పనిచేస్తూ ఆయన ప్రాణాలు కోల్పోవడం తెలంగాణ పోలీసు శాఖకు తీరని లోటు" అని అన్నారు. ఈ విషాద సమయంలో వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కమిషనర్, ఆ కుటుంబానికి శాఖాపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని త్వరలోనే పట్టుకొని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# రావిర్యాలలో కన్నుల పండుగగా వినాయక నిమజ్జనం...!

**జై బోలో గణేష్ మహారాజ్ అంటూ వెల్లివిరిసిన భక్తి, ఐకమత్యం**

**శోభాయాత్రలో పాల్గొన్న యువజన సంఘాలు, భజన మండళ్లు, గ్రామ ప్రజలు**

**మంగళ హారతులతో గంగమ్మ వడిలోకి చేరవేసిన ఆడపడుచులు..**





**మహేశ్వరం ప్రతినిధి క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామంలో వినాయక నిమజ్జనం కన్నుల పండుగగా సాగింది. గ్రామంలో ప్రతిష్టించిన 40కి పైగా వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్రలో యువజన సంఘాలు, భజన మండళ్లు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**వినాయక నిమజ్జనం ఎందుకు చేస్తారు?**

వినాయకుడిని భక్తితో ఇంటికి, మండపానికి తీసుకువచ్చి 9 రోజుల పాటు పూజించి, చివరి రోజున నీటిలో నిమజ్జనం చేయడం వెనుక లోతైన ఆధ్యాత్మిక అర్థం ఉంది. మట్టితో చేసిన గణపతి విగ్రహం పంచభూతాలలో ఒకటైన భూమికి ప్రతీక. విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా మళ్లీ ప్రకృతిలో కలిసిపోవడం, మనిషి జీవితం కూడా ప్రకృతి నుండి వచ్చి తిరిగి ప్రకృతిలోనే కలిసిపోతుందనే సత్యాన్ని తెలియజేయడం దీని ఉద్దేశం. అలాగే బాధలను, అహంకారాన్ని నీటిలో వదిలేసి, విఘ్నాలను తొలగించమని కోరుతూ గణపతిని సాగనంపడం ఆనవాయితీ. శోభాయాత్రలో డీజే సౌండ్స్, కోలాట నృత్యాలు, భజన కీర్తనలతో యువత హోరెత్తించింది. "జై బోలో గణేష్ మహారాజ్ కీ జై" నినాదాలతో గ్రామం మార్మోగింది. అనంతరం రావిర్యాల పెద్ద చెరువులో క్రేన్ సహాయంతో అన్ని విగ్రహాలను సురక్షితంగా నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, గ్రామ పెద్దలు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరిగాయని, అన్ని యువజన సంఘాలు ఐకమత్యంతో కలిసి పనిచేశాయని గ్రామస్థులు తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్..

**తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్**

**బీజేపీలో భారీ సంస్థాగత మార్పులు**

**ఏపీ, తెలంగాణ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్ నియామకం**

**తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్ బాధ్యతలు**

**ఆంధ్రప్రదేశ్‌తో సహా 5 రాష్ట్రాలకు జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్**

**దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శుల నియామకం**




బీజేపీ తమ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, సంయుక్త ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కూడా కొత్త బాధ్యులను కేటాయించింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్‌ను నియమించారు. ఆయన హైదరాబాద్ కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర సంయుక్త సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా వరంగల్ కేంద్రంగా పనిచేసేందుకు దశరథ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పుల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. జాతీయ స్థాయిలోనూ పలు కీలక నియామకాలు జరిగాయి. జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్‌ను నియమించగా, ఆయనకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గోవా రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. ఆయన ముంబై కేంద్రంగా పనిచేస్తారు. మరో జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా సౌదాన్ సింగ్‌ను నియమించి, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కేటాయించారు.

**ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే..**

మహారాష్ట్రకు అజయ్ జమ్వాల్, బీహార్‌కు భిఖూభాయ్ దల్సానియా, ఝార్ఖండ్‌కు పవన్ సాయి, గుజరాత్‌కు రత్నాకర్, ఉత్తరాఖండ్‌కు ఫణీంద్రనాథ్ శర్మ, పంజాబ్-చండీగఢ్‌కు మంత్రి శ్రీనివాసులు, ఉత్తరప్రదేశ్‌కు ధరమ్‌పాల్, పశ్చిమ బెంగాల్‌కు అమితాబ్ చక్రవర్తిని రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. అసోం, త్రిపుర రాష్ట్రాలకు రవీంద్ర రాజు, హిమాచల్ ప్రదేశ్‌కు సిద్ధార్థన్, ఢిల్లీ-హర్యానాకు పవన్ రాణా, ఛత్తీస్‌గఢ్‌కు కరమ్‌వీర్, మధ్యప్రదేశ్‌కు చంద్రశేఖర్, ఒడిశాకు మానస్ మహంతిని నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలకు సంబంధించిన సర్క్యులర్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ అన్ని రాష్ట్ర శాఖలకు పంపించారు.

## దానం వ్యవహారంలో సుప్రీం తీర్పును స్వాగతించిన సీపీఐ నారాయణ

**ఫిరాయింపులపై అన్ని పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన**

**బీజేపీ, బీజేపీ సైతం ఫిరాయింపులను ప్రోత్సాహించాలని విమర్శలు**

**ఫిరాయింపుల వల్ల ప్రజాస్వామ్యానికే నష్టమని వ్యాఖ్య**

**ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కఠినతరం చేయాలని సూచన**

దానం నాగేందర్ అనర్హత కేసులో సుప్రీంకోర్టు తీర్పు పార్టీ ఫిరాయింపులపై కీలక సందేశం ఇచ్చిందని సీపీఐ సీనియర్ నేత కె.నారాయణ అన్నారు. దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసిన విషయం తెలిసిందే. తెలంగాణ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునే అవసరం లేదని స్పష్టం చేసింది. 2023లో బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ నుంచి గెలిచిన నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనపై అనర్హత వేటు పడింది. ఈ తీర్పును ఒక్క దానం నాగేందర్ వ్యవహారానికే పరిమితం చేయకూడదని నారాయణ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న తీరుపై ఆత్మపరిశీలన జరగాలని సూచించారు. తీర్పు వెలువడిన వెంటనే బీజేపీ సంబరాలు చేసుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. దేశంలో, వివిధ రాష్ట్రాల్లో పార్టీ మార్పులను ప్రోత్సహించిన చరిత్ర బీజేపీకి కూడా ఉందని విమర్శించారు. ఇప్పుడు ఫిరాయింపులపై నీతులు చెప్పడం సరికాదని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేల చేరికలపై బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందని నారాయణ పేర్కొన్నారు. అయితే గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్న విషయాన్ని కూడా గుర్తు చేశారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.